ప్రజాశక్తి

ఆదివారం 3 మార్చి 2024 8 పేజీలు



గుంటూరు




పల్నాడు

ఏడాదిలో వరికపూడిశెల పూర్తిచేస్తాం

సాగర్ కాల్వలకు గోదావరి నీళ్లుఇస్తాం - పల్నాడులో నరహంతకుల్ని వదలిపెట్టం

పల్నాడు జిల్లా వాసులకు చంద్రబాబు భరోసా

దాచేపల్లి రా కదలిరా సభలో వైసిపి ఎమ్మెల్యేలపై ధ్వజం





ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి/దాచేపల్లి

అటవీ,పర్యావరణ అనుమతి లభించిన వరికపూడిశెల ఎత్తిపోతల పనులను ఏడాదిలో పూర్తి చేస్తామని టిడిపి అధినేత చంద్రబాబు తెలిపారు. గోదావరి, పెన్నా అనుసంధానం చేసి గోదావరి జలాలను సాగర్ కాల్వలకు మళ్లిస్తామన్నారు. శనివారం సాయంత్రం 5 గంటలకు దాచేపల్లి వద్ద జరిగిన రా కదలిరా సభలో ఆయన ప్రసంగించారు. సభకు టిడిపి పల్నాడుజిల్లా అధ్యక్షులు జి.వి.ఆంజనేయులు అధ్యక్షత వహించారు. ఎంపి లావు కృష్ణదేవరాయులు, మక్కెనమల్లిఖార్జునరావు చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరారు. చంద్రబాబు ప్రసంగిస్తూ పల్నాడులో జగన్ రక్తం పారించారు, నేను నీళ్ల పారిస్తానని తెలిపారు. పల్నాడు జిల్లాలో బుగ్గవాగు నుంచి గ్రావిటీ ద్వారా దాచేపల్లి, పిడుగురాళ్లకు పట్టణానికి నీళ్లిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. తంగెడ, కొత్తపాలెం, పెల్లుట్ల గ్రామాలకు లిఫ్ట్ ఇరిగేష్ ఏర్పాటు చేసి నీరిస్తామన్నారు. గురజాలలో టిడిపి హయాంలో నిర్మించిన ఇళ్లన్నీ పూర్తి చేసి ఇస్తాం. నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం మోపుతాం. రోడ్లకు మహర్ధశ తీసుకొస్తామన్నారు. క్లీన్ ఇమేజ్ ఉన్న లావు శ్రీకృష్ణదేవరాయలు వంటి నేతల్నే పార్టీలో చేర్చుకుంటామన్నారు. ఎంతో మంది కార్యకర్తలు టిడిపి జెండా కోసం పల్నాడులో బలయ్యారని అన్నారు. తోట చంద్రయ్య జై తెలుగుదేశం అంటూ ప్రాణాలొదిలారని తెలిపారు.జంగమహేశ్వరపాడులో జల్లయ్య యాదవ్, దాచేపల్లిలో పురంశెట్టి అంకుల్, అంబాపురంలో దోమతోటి విక్రమ్, నరసరావుపేటలో ఇబ్రహీంను, నకరేకల్ లో మంత్రిబాయి అనే ఎస్టీ మహిళను, తాజాగా

2 లో



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంఅండ్‌హెచ్‌ఒ తదితరులు

నిండు జీవితానికి రెండు చుక్కలు

- నేటి నుండి జిల్లాలో పల్స్‌పోలియో

ప్రజాశక్తి-గుంటూరు

పిల్లలకు పోలియో సోకుండా ముందస్తుగా 0-5 ఏళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి అన్నారు. నేటి నుండి ప్రారంభం కానున్న పల్స్ పోలియో క్యాంపెయిన్‌పై అవగాహనకు శనివారం స్థానిక డిఎంఅండ్‌హెచ్‌ఒ కార్యాలయం నుండి నగరంపాలెం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డిఎంఅండ్‌హెచ్‌ఒ ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎంఅండ్‌హెచ్‌ఒ మాట్లాడుతూ జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకూ బూత్‌లెవల్ యాక్టివిటీ ఉంటుందన్నారు. .

2 లో

7న గుంటూరుకు ఇద్దరు సిఎంలు?

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఇండియా వేదిక ఆధ్వర్యంలో న్యాయసాధన సభలో పాల్గొనేందుకు తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి, కర్నాటక సిఎం సిద్దరామయ్య, డిప్యూటీ సిఎం డికె శివకుమార్ ఈనెల 7న గుంటూరు రానున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. విజయవాడ రోడ్డులో సభా వేదికను శనివారం సూచన ప్రాయంగా ఖరారు చేశారు. ప్రధానంగా రాష్ట్ర పునర్విభజన చట్టం హామీల అమలు, అమరావతి రాజధాని నిర్మాణం తదితర అంశాలపై వీరు ప్రస్తావించనున్నారు. అయితే రేవంత్ రెడ్డి పర్యటన ఇంకా ఖరారు కాలేదని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. 7న గుంటూరు లేదా 11న విశాఖకు రేవంత్ రెడ్డి వచ్చే అవకాశం ఉందని ఈమేరకు ఆదివారం ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడిస్తామని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి తెలిపారు.

అంగన్వాడీల సమ్మెకాలం జీతం చెల్లించాలి

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావమ్మ డిమాండ్



మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-గుంటూరు

అంగన్వాడీల సమ్మెకాలం జీవితం జీవోను తక్షణమే ప్రభుత్వం విడుదల చేసి, జీతం చెల్లించాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావమ్మ డిమాండ్ చేశారు. శనివారం పాత గుంటూరు సిఐటియు కార్యాలయంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఏవిఎన్ కుమారి అధ్యక్షతన జరిగిన జిల్లా సమావేశంలో ఆమె ప్రసంగించారు.రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలు 42 రోజులపాటు వీరోచితంగా పోరాడారని అంతిమంగా ప్రభుత్వం అంగన్వాడీల అనేక డిమాండ్లు ఆమోదిస్తూ ఒప్పందం చేసిందని అన్నారు. ప్రభుత్వం మినిట్స్ కాపీ విడుదల చేసినా, జీవోలు ఇచ్చే విషయంలో తాత్సారం చేస్తుందని విమర్శిం చారు. అంగన్వాడీలు చనిపోయిన సందర్భంగా మట్టి ఖర్చులు ఇస్తామని ఒప్పందం చేశారని, ఒప్పందం తర్వాత అనేక మంది చనిపోయారని, వారందరికీ మట్టిఖర్చులు ఇచ్చేందుక వీలుగా జీఒ జారీ చేయాలన్నారు. కొన్ని సమస్యలపై చర్చించి, నిర్ణయం తీసుకునేందుకు త్రైపాక్షిక కమిటీని వేస్తానని హామీ ఇచ్చిందని, కావున తక్షణమే కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం ఇదే విధంగా తాత్సారం కొనసాగిస్తే జీవోల కోసం అవసరమైతే అంగన్వాడీలు మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.దీప్తిమనోజ మాట్లాడుతూ అంగన్వాడి హెల్పర్ల ప్రమోషన్ ఫైలు నెలల తరబడి ఆఫీసులలో కదలడం లేదని తక్షణమే పెండింగ్లో ఉన్న ప్రమోషన్లు ఇవ్వాలని, ఖాళీ పోస్టులన్నీ భర్తీ చేయాలని అన్నారు సిడిపిఓ ఆఫీసులలో రోజుకొక అంగన్వాడీ హెల్పర్ చేత పనిచేయిస్తున్నారని, అలాగే కొంతమంది అధికారులు హెల్పర్ల చేత తమ ఇళ్లలో కూడా పనిచేయించుకుంటున్నారని, ఈ విధానానికి తక్షణమే స్వస్థి పలకాలన్నారు. లేదంటే యూనియన్‌గా దీనిపై తీవ్రంగా స్పందించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో యూనియన్ జిల్లా నాయకులు టి.రాధా, తబిద, హేమలత, రత్న మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 98.22 శాతం హాజరు

ప్రజాశక్తి-గుంటూరు

ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శనివారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ప్రారంభం అయ్యాయి. సెకండ్ లాగ్వేంజ్ పరీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 92 పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. జనరల్ విద్యార్థులు 25,762 మందికిగాను, 25345 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1093 మందికిగాను, 1034 మంది హాజరయ్యారు. జనరల్, ఒకేషనల్ కలిపి 26855 మందికి గాను 26379 మంది హాజరయ్యారు. 476 మంది గైర్హాజరాయ్యరు.రెండో రోజు 98.22 శాతం హాజరు నమోదు అయ్యింది. ఫ్లైయ్యింగ్ స్క్వాడ్‌లు పలు కేంద్రాలను తనిఖీ చేశారు.

రూ.1497.14 కోట్లతో జిఎంసి బడ్జెట్ - స్టాండింగ్ కమిటీ ఆమోదం

2లో

కార్పొరేట్ సేద్యానికి మోడీ కుట్ర

20 రోజులుగా రైతులు పోరాటం చేస్తున్నా మొండి వైఖరి వీడని కేంద్రం

సిపిఎం రాష్ట్ర నాయకులు వి.కృష్ణయ్య



మాట్లాడుతున్న వి కృష్ణయ్య, వేదికపైన గుంటూరు విజయకుమార్ తదితరులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ పరం చేసి రైతులను సొంత భూముల్లోనే వ్యవసాయ కూలీలుగా మార్చే నల్ల చట్టాలకు కార్పొరేట్ శక్తులకు అండగా ఉంటున్న మోడీకి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని ఇదే క్రమంలో రాష్ట్రంలో అధికార వైసిపి ప్రతిపక్ష టిడిపి జనసేన పార్టీలు మోడీ పక్షమా ప్రజా పక్షమా తేల్చుకొని ప్రజలను ఓట్లు అడగాలని సిపిఎం రాష్ట్ర నాయకులు వి కృష్ణయ్య అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట కోటప్పకొండ రోడ్డులోని సిపిఎం జిల్లా కార్యాల యంలో శనివారం జిల్లా కార్య దర్శి వర్గసభ్యులు ఏపూరి గోపాలరావు అధ్యక్షత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ గతంలో రైతాంగ పోరాటానికి తలొంచి రైతులకు నమస్కరించిన సందర్భంలో మోడీ రైతులకు ఇచ్చిన 6 హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. మద్దతు ధరల చట్టం, రుణమాఫీ, స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు, 2020 విద్యుత్ చట్టం ఉపసంహరణ, లఖింపూర్ ఖేరి ఘటనలో మరణించిన రైతు కుటుంబాలకు నష్టపరిహారం, రైతు ఉద్యమంలో రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలన్న డిమాండ్లతో రైతులు చేస్తున్న న్యాయ పోరాటాలను అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. డిమాండ్లను పరిష్కరించకపోతే ఢిల్లీలో తీవ్రస్థాయిలో నిరసన చేస్తామని రైతు సంఘాలు అల్టిమేటం జారీ చేసినప్పటికీ బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వహిస్తుందని మండిపడ్డారు. రైతు సంఘం నాయకులు కేంద్ర మంత్రులు జరిపిన చర్చలలో దిగొచ్చిన కేంద్ర ప్రభుత్వం 3 డిమాండ్లను పరిష్కరిస్తామని చెబుతూ ప్రధాన అంశమైన మద్దతు ధరల చట్టంపై నోరు మెదపకపోవడం రైతులను మోసం చేయడానికేనన్నారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మోదీని నిలదీయ లేని అధికార వైసిపి ప్రతిపక్ష టిడిపి జనసేన లు ఇదే సమయంలో బిజెపి పక్షమా రైతుల పక్షమా అనేది తెలుసుకోవాల్సిన సమయం

2 లో



మాట్లాడుతున్న నరసింహారావు

పంచాయతీ కార్మికుల సమస్యలపై మండలాల్లో నిరసనలు

ప్రజాశక్తి-గుంటూరు

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మండల స్థాయిలో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ఏ.పి. గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ సభ్యులు డి.వి.నరసింహారావు పిలుపునిచ్చారు. పాత గుంటూరు సిఐటియు కార్యాలయంలో ఎం.నాగలక్ష్మి అధ్యక్షతన జరిగిన యూనియన్ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో అనేక గ్రామ పంచాయతీలలో కార్మికులకు నెలల తరబడి జీతాలు చెల్లించలేదని అన్నారు. అత్తెసరు జీతాలతో పని చేస్తున్న కార్మికులకు, ఏ నెలకు ఆనెల జీతాలు చెల్లించకపోతే కుటుంబం ఎలా గడుస్తుంది అని ప్రశ్నించారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతుండగా పంచాయితీ కార్మికుల జీతాలు మాత్రం ఏడాదికి ఒకసారి కూడా పెంచక పోవడం అన్యాయం అన్నారు. ఏటా యూనిఫారం ఇవ్వాలని, సబ్బులు, నూనె తదితర కనీస సౌకర్యాలు ఇవ్వకపోవడం అన్యాయం అన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంచాయితీ కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలు ఏ ఒక్కటీ అమలు చేయలేదని అన్నారు. రెగ్యులర్ చేస్తానని, సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనం 10వేలు ఇస్తామన్న వాగ్దానాలు ఏవీ అమలులోకి రాలేదని అన్నారు. పైగా ఈకాలంలో గ్రీన్ అంబాసిడర్లుగా పని చేసిన వారిని అనేక మందిని ఉద్యోగాల నుండి తొలగించారని అన్నారు. అందువల్ల పంచాయితీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు రామారావు, కె.సుబ్బారావు, పి.మీనకరావు, కే.శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

(మొదటిపేజీ తరువాయి)

ఇందులో అప్పుడే పుట్టిన బిడ్డ నుండి 5 సంవత్సరాలలోపు పిల్లలందరికీ పూర్తిగా పోలియో చుక్కలు వేస్తారని అన్నారు. 4, 5 తేదీల్లో గ్రామీణ ప్రాంతాలలో, 6వ తేదీన గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇంటింటికి వెళ్లి మొదటి రోజు వేయించుకోని వారికి పోలియో చుక్కలు వేస్తారని అన్నారు. ఇందులో ఆరోగ్యకార్యకర్తలు , ఆశ కార్యకర్తలు , వాలంటీర్స్ పాల్గొంటారని తెలియజేసినారు. సంచార జాతులు, యాచకులు, గహనిర్మాణ కార్మికులు , వివిధ కర్మాగారాలలో పనిచేసే రోజువారి కూలీల పిల్లలను తప్పక కవర్ చేయాలని తెలియజేసినారు.అనంతరం విలేకరు సమావేశంలో డిఎంహెచ్ఒ మాట్లాడుతూ జిల్లాలో 0 - 5 సం. పిల్లలు 2,09,219 మంది ఉన్నారని, వలస పిల్లలు 2808 ఉన్నారని, హైరిస్క్ పాయింట్లు 784 ఉన్నాయన్నారు. పల్స్ పోలియో బూత్‌లు 950, మొబైల్ టీమ్స్ 72 ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ కె.వి.సుబ్బరాజు, ఎన్‌సిడి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఈ.అన్నపూర్ణ, డిప్యూటీ డి.యమ్.హెచ్.ఓ, డాక్టర్ డి.శ్రీనివాసులు, డిఎల్ఎటిఓ డాక్టర్ లక్ష్మనాయక్, డెమో ఏ.జయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పజాశక్తి పెదనందిపాడు రూరల్ : ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ. మండలంలోని అన్ని గ్రామాలలో శనివారం వైద్య ఆరోగ్య సిబ్బంది ఆయా గ్రామాల్లోని పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారులు డాక్టర్ జి. లావణ్య .డాక్టర్ బి విజయ రత్నకుమార్ లు మాట్లాడుతూ మండల గ్రామాల్లో ఐదు సంవత్సరాలలో పిల్లలను 2252 మంది పిల్లలను గుర్తించామన్నారు .మండల మొత్తం మీద 19 పోలియో బూత్ లు ఏర్పాటు చేశామన్నారు .ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ జిల్లా నాయకులు పోపూరి లక్ష్మీనారాయణ. సి హెచ్ ఓ ప్రసాద స్వామి, ఆరోగ్యాభోదకురాలు సుజన, ఆరోగ్యపర్యవేక్షకురాలు పి. అరుంధతి. వైద్య ఆరోగ్య సిబ్బంది పలు పాఠశాలల విద్యార్థులు యజమాన్యం పాల్గొన్నారు

రూ.1497.14 కోట్లతో జిఎంసి బడ్జెట్

- స్టాండింగ్ కమిటీ ఆమోదం

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు నగరపాలకసంస్థ 2024-25 సంవత్సరానికి రూ.1497.14 కోట్ల అంచనాలతో రూపొంది ంచిన బడ్జెట్‌కు నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. శనివారం మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు అధ్యక్షతన, నగర కమిషనర్ కీర్తి చేకూరితో కలిసి మేయర్ ఛాంబర్‌లో స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరంకు సంబంధించి రివైజ్డ్ బడ్జెట్, 2024-25 అంచనాల బడ్జెట్‌పై చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరం 634.56 కోట్ల ప్రారంభ నిల్వతో, వార్షిక ఆదాయం రూ.612.62 కోట్లతో కలిపి రూ.1247.19 కోట్లతో కౌన్సిల్ ఆమోదం తెలిపిందన్నారు. అందులో రూ.578.62 కోట్లు ఖర్చులు పోగా, అంత్య నిల్వ రూ.669.56 కోట్లు ఉందన్నారు. అదేవిధంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రారంభ నిల్వ రూ.669.56కోట్లు ఉండగా, జిఎంసి ఆదాయం రూ.828.57 కోట్లు అంచనాతో రూ.1497.14 కోట్లతో నగరపాలక సంస్థ వార్షిక బడ్జెట్‌కు ఆమోదం తెలిపినట్లు వివరించారు. త్వరలో జరిగే కౌన్సిల్ సమావేశంలో బడ్జెట్‌ను కౌన్సిల్ ఆమోదం కోసం ప్రవేశ పెట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, విభాగాధిపతులు, స్టాండింగ్ కమిటి సభ్యులు షేక్.మహమూద్, సంకురి శ్రీనివాసరావు, కంద్రగుంట గురవయ్య, శ్యామల వెంకట రమణాదేవి, మల్లిబోయిన శ్రీవల్లి, పాపతోటి అంబేద్కర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్

వేగంగా ఎటి అగ్రహారం రహదారి నిర్మాణం

పరిశీలించిన మంత్రి రజని, మేయర్ కావటి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఏటీ అగ్రహారం ప్రధాన రహదారి పనులను మరో రెండు, మూడు రోజుల్లో ప్రారంభించబోతున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. ఈ రహదారిని శనివారం రజిని సందర్శించారు. పోలేరమ్మ గుడి వద్ద నుంచి తొమ్మిదో లైను వరకు. మేయర్ కావటి శివనాగమనోహర్‌నాయుడుతోపాటు అధికారులతో కలిసి పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణం కోసం మొత్తం రూ.22 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. పనులకు సంబంధించి ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. వర్క్ ఆర్డర్ కూడా జారీ చేశామన్నారు. అగ్రిమెంట్ పూర్తయిన వెంటనే రెండు, మూడు రోజుల్లో రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తామన్నారు. ప్రధాన రహదారిని అత్యంత సర్వాంగ సుందరంగా నిర్మించబోతున్నామని మంత్రి తెలిపారు. సెంట్రల్ లైటింగ్, రెండు వైపులా డ్రెయిన్లు నిర్మాణం చేపట్టారన్నారు. ఇప్పటికే గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఈ ఐదేళ్లలో ఏకంగా రూ.500 కోట్లకుపైగా అభివద్ధి పనులు చేపట్టామని వివరించారు. వాకింగ్ ట్రాక్ లు, పార్కులు, రోడ్లు, డ్రెయిన్లు.. ఇలా అభివద్ధి కార్యక్రమాలన్నీ చేపడుతున్నామని తెలిపారు. పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని అక్కడ ఉన్న అధికారులను ఆదేశించారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే 5 డివిజన్ల ప్రజలకు ఎంతో ఉపశమనం లభిస్తుందని చెప్పారు. గుంటూరు నగరంలో తమ ప్రభుత్వం చేస్తున్న అభివద్ధికి ఏటీ అగ్రహారం రహదారి ఒక ఉదాహరణగా నిలుస్తుందని మేయర్ కావటి శివనాగమనోహర్‌నాయుడు తెలిపారు. దశాబ్దాలుగా నిర్మాణానికి నోచుకోని ఎన్నో రహదారులకు తమ హయాంలో మోక్షం లభించిందన్నారు. కార్పొరేటర్లు రోషన్, అచ్చాల వెంకట రెడ్డి, సంపత్,ఈఈ సుందరరామిరెడ్డి పాల్గొన్నారు.



కార్పొరేట్ సేద్యానికి మోడీ కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

ఆసన్నమైందన్నారు. రాష్ట్రంలోని అధికార ప్రతిపక్ష పార్టీలకు మోడీ భజన చేయటం తప్ప రాష్ట్ర ప్రయోజనాల గురించి ప్రశ్నించలేని దయనీయ పరిస్థితి దాపురించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ 9 రోజుల పాటు 3 టీఎంసీల నీటిని తాగునీరు కోసం విడుదల చేస్తున్నామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం పంటలు చివరి దశలో ఉన్న మిర్చి మొక్కజొన్నకు ఒక తడి నీటి ఇచ్చేందుకు టీఎంసీల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు ప్రకాశం జిల్లాతో కలిపి 1 లక్ష హెక్టార్లలో సాగు చేసిన మిర్చికి ప్రయోజనం దక్కుతుందన్నారు. సీడ్ టూ సేల్ అంటూ విత్తనం నుండి పంట వరకు రైతు ఉత్పత్తులను రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని చెప్పిన వైసిపి రైతులను మోసం చేసిందన్నారు. ప్రస్తుతం రైతులు రబీలో సాగుచేసిన మొక్కజొన్న శనగలను వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీల ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలలో అక్రమంగా గెలవాలని ఓటర్లను ప్రభావితం చేస్తూ రాజకీయ పార్టీల అభిప్రాయం మేరకు బూతులు కొనసాగాల్సి ఉండగా ఆదిశగా ఆలోచన చేయడం లేదన్నారు. ప్రతి గ్రామంలో ఉపాధి పనులు అమలు చేసి రైతులను రైతు కూలీలను ఆదుకోవాలన్నారు. నష్టపోయిన రైతులతో పాటు పంటలు సాగు చేయని రైతులకు కూడా ఆర్థిక సహాయం చేయాలని కౌలు రైతులకు కూడా రైతు భరోసా అందజేయాలన్నారు. అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులు సమ్మె నేపథ్యంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై రాధాకష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వర్ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఆంజనేయ నాయక్, కొత్తపల్లి హనుమంత రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు డి శివకుమారి, నాయకులు ఆంజనేయరాజు పాల్గొన్నారు.

ఏడాదిలో వరికపూడిశెల పూర్తిచేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

రెంటచింతల మండలం మల్లవరంలో సామినిబాయిని మరో గిరిజన మహిళను వైసిపి వారు చంపారన్నారు. గురజాలలో 11 మంది, మాచర్లలో 8 మందిని జిల్లా వ్యాప్తంగా 30 మంది టీడీపీ కార్యకర్తలను వైసీపీ కార్యకర్తలు పొట్టనపెట్టుకున్నారన్నారు. ఏ తప్పు చేయని ప్రత్తిపాటి పుల్లారావు కొడుకుని అరెస్ట్ చేశారు, మరి జగన్ చేసిన నేరాలు, ఘోరాలకు ఏం శిక్ష వేయాలి? జగన్ బెదిరింపులకు భయపడేవారెవరూ లేరు. నేను ప్రజాస్వామ్యవాదిని నా దగ్గర పులివెందుల పంచాయితీలు చేస్తే...కుర్చీని మడచినట్టు మడచి నీ ఊరికి పంపిస్తానని హెచ్చరించారు. పల్నాడులో జగన్ ఇచ్చిన హామీలు ఒక్కటైనా అమలు చేశారా? యువతకు ఉద్యోగాలు ఇచ్చారా? ఒక్క పరిశ్రమ తెచ్చారా? పల్నాడుకి నీళ్లిచ్చే ఒక్క ప్రాజెక్టు పూర్తి చేశాడా? నాగార్జున సాగన్ నుంచి నకిరేకల్ కి నీళ్లు తేవాలని నేను ప్రారంభించిన గోదావరి లిఫ్ట్ ఇరిగేషన్ ని ఆపేశారన్నారు. రూ. 600 కోట్లతో త్రాగునీటికోసం వాటర్ గ్రిడ్ తెస్తే...దాన్ని పూర్తి చేయలేకపోయారని టిడిపి అధికారంలోకి రాగానే పూర్తి చేస్తామన్నారు. యరపతినేని శ్రీనివాసరావు పడ్డ బాధ, ఆవేధన నా కళ్ల ముందు ఇంకా కన్పిస్తూనే ఉంది. కార్యకర్తల కోసం ఎన్నో త్యాగాలకు సిద్ధపడ్డ బ్రహ్మారెడ్డి, యరపతినేనిని నేను మర్చిపోలేనన్నారు. 2029 నాటికి అమరావతి, పోలవరం పూర్తి చేసి, నదుల అనుసందానంతో ప్రతి ఎకరాకి నీళ్లు ఇచ్చి, ఉద్యోగాలు ఇద్దామని కలలు కన్నానని కానీ జగన్ అధికారంలోకి రావడంతో ఇవ్వన్నీ నిలిచిపోయాయని తెలిపారు.

దోపిడిదారులు వైసిపి ఎమ్మెల్యేలు

మాచర్లలో మారీచుడు పిన్నెల్లి రామకష్ణారెడ్డి చెయ్యని దోపిడి, కబ్జా లేదన్నారు. మాచర్ల దారిలో గ్రానైట్ లారీలు వస్తే ఎమ్మెల్యే కప్పం కట్టించుకుంటున్నారని అన్నారు. .అక్రమ మద్యం, రేషన్ మాఫియాకు కేరాఫ్ అతను. తెలంగాణ మద్యం ఏరులై పారుతుంటే సిఎం పట్టించుకున్నాడా అని నిలదీశారు.





మాచర్లలో 150 ఎకరాలు, 7 ఎకరాల వినాయకుడు గుడి భూమి, వెల్దుర్తిలో 30 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా చేసి వెంచర్లు వేసి అమ్ముకుంటున్నారన్నారు. గురజాలలో కాసు మహేష్ రెడ్డి సున్నపు రాయి, ముగ్గు రాళ్ల వ్యాపారం ఏది దొరికితే అది అన్నట్లు దోచుకున్నాడన్నారు. ఆ డబ్బుతో గురజాల, నరసరావుపేటలో షాపింగ్ మాల్స్ కడుతున్నాడన్నారు. వినుకొండలో బొల్లా బ్రహ్మనాయుడి అరాచకాలన్నీ రాసుకుంటున్నా. ఎమ్మెల్యే ట్యాక్స్ ను ప్రజలు భరించలేక వణికిపోతున్నారన్నారు. 3 ఎకరాల ముస్లింల భూమి, తెల్లపాడులో 8 ఎకరాల ఆర్యవైశ్యల భూమి, బ్రాహ్మణపల్లిలో 170 ఎకరాల జాగాను కబ్జా చేశాడు. అక్రమ భూ పట్టాల ద్వారా రూ.100 కోట్లు దోచుకున్నాడన్నిరు. పెదకూరపాడులో ఎమ్మెల్యే శంకర్రావు మాఫియా కష్ణా నదినే తవ్వేసిందన్నారు. రోజుకు రూ.30 కోట్లు ఇసుక దోచుకుంటున్నాడని తెలిపారు. ఇందులో జగన్ రెడ్డికి వాటా ఉందన్నారు. 400 ఎకరాల అటవీ భూమిని ఆక్రమించుకున్నాడు. నరసరావుపేటలో గోపిరెడ్డి అరాచక వాది. ప్రతీ పనికి కప్పం కట్టాల్సిందే ఇతనికి. చిలకలూరిపేటలో సైబరాబాద్ మొక్క రజినికిఓడిపోయే గుంటూరు పశ్చిమ సీటు ఇచ్చారన్నారు. మాజీమంత్రులు కన్నా లక్ష్మీనారాయణ, పత్తిపాటి పుల్లారావు, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, టిడిపి నాయకులు యరపతినేని శ్రీనివాసరావు, కొమ్మాలపాటి శ్రీధర్, జూలకంటి బ్రహ్మారెడ్డి, చదలవాడ అరవిందబాబు, భాష్యం ప్రవీణ్, మక్కెనమల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛంద సేవా సంస్థలు తిరుగులేని శక్తిగా మారాయి

ప్రజాశక్తి-ఎఎన్‌యు: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సు వర్సిటీ డైక్ మెన్ ఆడిటోరియంలో శని వారం ఘనంగా ముగిసింది. ముగింపు సదస్సుకు వర్సిటీ సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగధిపతి, సదస్సు డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వర్సిటీ రెక్టర్ ఆచార్య పి వరప్రసాద మూర్తి మాట్లాడుతూ నేటి సమాజంలో స్వచ్ఛంద సేవా సంస్థలు తిరుగులేని శక్తిగా మారా యని తెలిపారు. పేదలు నిరుపేదలు నిర్లక్ష్యానికి గురైన వయోవృద్ధులు, బాల కార్మికులు, రోగులు, అణగారిన వర్గాలకు సేవలు అందించడంలో ఎన్జీవోల పాత్ర ముఖ్యమైందని అన్నారు. శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ సోషల్ సైన్స్ డీన్ ఆచార్య జీవి రమణ మాట్లాడుతూ ఎన్జీవోలపై ఒకరు సానుకూల దృక్పథంతో ఉండాలని సూచించారు. గోవా కి చెందిన జాగ్రఫీ అధ్యాపకులు డాక్టర్ రత్ మాట్లాడుతూ ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలు విద్యా పరి శోధన అంశాలపై దృష్టి



సారించాలని చెప్పారు. అనంతరం జట్టు ట్రస్ట్ నిర్వా హకులు డాక్టర్ డి. పారి నాయుడు,వర్సిటీ కాలేజీ డెవలప్మెంట్ కౌన్సిల్ డీన్, ఎక ానామిక్స్ విభాగధిపతి ఆచార్య కడిమి మధు బాబు,సదస్సు డైరెక్టర్ ఆచార్య వెంకటేశ్వర్లు మాటాడారు. జాతీయస్థాయిలో కర్ణాటక, గోవా, పంజాబ్, తమిళనాడు, ఒడిస్సా తో పాటు రెండు తెలుగు రాష్ట్రాల నుండి మొత్తం 160 పైగా పరిశోధన పత్రాలు వచ్చాయని వెంకటేశ్వర్లు అన్నారు. అనంతరం అధ్యాపకులు, పరిశోధ కులు, విద్యా ర్థులకు సర్టిఫికెట్ల ప్రదానం చేశారు. సోషల్ సైన్స్ డీన్ ఆచార్య ఎం.త్రిమూర్తి రావు సదస్సు నివేదికను అందించారు.

రోడ్డు భద్రతా అంశాలపై అవగాహన సదస్సు

విశ్వ విద్యాలయంలోని జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శనివారం జాతీయ రహదారి భద్రతలో భాగంగా రోడ్డు సేఫ్టీ ఫర్ హెల్త్ సేఫ్టీ అనే అంశంపై అవగాహన సదస్సు ఎన్ఎస్ఎస్ భవన్ లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గుంటూరు రీజియన్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ డాక్టర్ బి. కృష్ణవేణి పాల్గొని పలు సూచ నలు చేశారు. గుంటూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.మల్లీశ్వరి మాట్లాడుతూ 17 నుంచి 25 సంవత్సరాల మధ్య వయసు గల యువత రోడ్డు ప్రమాదాలకు ఎక్కువగా గురవుతున్నారని, అనంతరం ఎం. ఇందుశేఖర్, డాక్టర్ డి.రవిశంకర్‌రెడ్డి మాట్లాడారు.

మండల సమాఖ్య ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం

ప్రజాశక్తి-ఈపూరు: మండల సమాఖ్య ఆధ్వర్యంలో ప్రకతి వ్యవసాయం సాగు చేసేలా డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా న్యాచురల్ ఫార్మింగ్ అసోసియేట్ సైదయ్య అన్నారు. స్థానిక ఇందిరా క్రాంతి కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు ప్రకతి వ్యవసాయంపై శనివారం అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకతి వ్యవసాయ అమలు చేసే ఏజెన్సీ బాధ్యతలను ఏపీఎం రంగారెడ్డికి అందజేశారు.

ముగిసిన క్రీడా పోటీలు

ప్రజాశక్తి-ఎఎన్‌యు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో రెండు రోజులుగా జరుగుతున్న అంతర్ కళాశాలల పురుషుల సాఫ్ట్బాల్ పోటీలు శనివారంతో ముగిశాయి. ఈ పోటీలలో చిలకలూరిపేట లోని సి ఆర్ కళాశాల విజేతగా నిలవగా, ఆర్ వి ఆర్ ఎం జెసి కళాశాల రెండవ స్థానంలో, ముప్పాళ్ళల్లోని ధనలక్ష్మి కళాశాల మూడవ స్థానంలో నిలి చారు. అలాగే అంతర్ కళాశాలల పురు షుల సెపక్తక్రా పోటీలలో విశ్వవిద్యాలయ వ్యాయామ కళాశాల విజేతగా నిలిచింది. రెండో స్థానంలో నాగార్జునసాగర్ లోని ఏపీ రెసిడెన్షియల్ కళాశాల, మూడవ స్థానంలో సత్తెన పల్లిలోని ఏజికేయం కళాశాల నిలి చాయి. శనివారం జరిగిన అంతర్ కళా శాలల స్త్రీ, పురుషుల పవర్ లిఫ్టింగ్ పోటీ లలో గుంటూరు లోని ప్రభుత్వ మహిళా కళాశాల ఓవరాల్ ఛాంపియన్ గా నిలిచింది. బెస్ట్ లిఫ్టర్ గా పురుషుల విభా గంలో ఎం. అశోక్ కుమార్ సత్తెనపల్లిలోని ఏజీ కేఎం కళాశాల, మహిళల విభాగంలో గుంటూరులోని జి సి కె వి యెన్ డి సి కళాశాలకు చెందిన టి. నాగ జ్యోతి నిలి చారు. వీరికి వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పి జాన్సన్ ట్రోఫీలను అందజేశారు. క్రీడా పోటీల నిర్వహణలో వర్సిటీ యోగ విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ డి. సూర్య నారాయణ, సెలక్షన్ కమిటీ సభ్యులుగా పాల్గొన్న ఎన్ శేషగిరిరావు, ఎ.కృష్ణవేణి తదితరులు పర్యవేక్షించారు.

ఇంజనీరింగ్ కళాశాలలో ముగిసిన వర్క్‌షాప్

విశ్వవిద్యాలయంలోని డాక్టర్ వైయస్సార్ ఇంజనీరింగ్ కళాశాల లో ఎలక్ట్రికల్ విభాగంలో రెండు రోజులుగా జరుగుతున్న లిరీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఎలక్ట్రిక్ వెహికల్స్ అండ్ స్మార్ట్ గ్రేడ్స్‌లి అనే జాతీయస్థాయి వర్క్ షాపు శనివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ఎన్ఐటి వరంగల్ నుంచి డాక్టర్ హరీష్ పాల్గొన్నారు. ఎలక్ట్రిక్ వెహికల్స్ లో బ్యాటరీ ఛార్జింగ్ కు వైర్లెస్ పవర్ ట్రాన్స్‌ఫర్ టెక్నాలజీ అనే అంశంపై మాట్లాడారు. చెన్నైలోనే హిటాచి సంస్థ లో పనిచేస్తున్న డాక్టర్. జెతేంద్రనాథ్ పవర్ క్వాలిటీ ప్రాబ్లమ్స్ ఇన్ స్మార్ట్ గ్రిడ్స్ అనే అంశంపై తన పరిశోధన వ్యాసాలను వివరించారు. ఇండియన్ స్టాండర్డ్ ఇన్నోవేషన్ ఇండియా సంస్థ నుంచి పాల్గొన్న కుమార్ గంగాధరన్ మాట్లాడారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పి.సిద్దయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని ధ్రువపత్రాలను అందజేశారు. ఈ వర్క్ షాప్ కు డైరెక్టర్‌గా ఎం.వాసవి ఉమా మహేశ్వరి వ్యవహరించారు.

స్టాటిస్టికల్ పరిశోధనలు విస్తతం కావాలి

మ్యాథమెటిక్స్, స్టాటిస్టికల్ పరిశోధనలు దైనందిన జీవితంలో భాగం కావాల్సిన అవసరం ఉందని విశ్వవిద్యాలయ రెక్టార్ ఆచార్య పి. వరప్రసాద్ మూర్తి అన్నారు. యూజీసీ సహకారంతో వర్సిటీలోని స్టాటిటిక్స్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న లి మ్యాథమెటిక్స్ స్టాటిస్టిక్స్ అండ్ డేటా అనాలసిస్ యూజింగ్ ఆర్‌లి అనే జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది.

స్థల వివాదంలో ముగ్గురు బైండోవర్

ప్రజాశక్తి-తాడికొండ: తాడికొండ అడ్డరోడ్డులోని పున్నమ్మ చెరువుకు సమీపంలో ఉన్న స్థలం వివాదంలో ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి తహసీల్దార్ వద్ద బైండోవర్ చేస్తున్నట్లు తాడికొండ సీఐ ప్రభాకర్ పేర్కొన్నారు. శనివారం అడ్డరోడ్డులోని స్థలం వద్ద ఇరువురు వ్యక్తుల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవటంతో విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలంకు చేరుకొని ఇద్దరిని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తాడికొండ అడ్డరోడ్డులో ఉన్న పున్నమ్మ చెరువు వద్ద గుంటూరుకు చెందిన అద్దంకి శ్రీకృష్ణ, గోర్లంటకు చెందిన ఎర్రంశెట్టి రవిలు కొంత భూమిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. సదరు భూమిలో కొంత భాగం మాదంటే మాది అంటు గతంలో పలుమార్లు వాగ్వాదం చోటుచేసుకుందన్నారు. తరుచు గోడవలు పడుతుండటంతో ఇద్దరిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ వద్ద బైండోవర్ చేస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ అందుబాటులో లేకపోవటంతో సోమవారం ఇద్దరితో పాటు పాటు, వివాదంలో ఉన్న జీ.వెంకటశివ ప్రసాద్‌ను బైండోవర్ చేస్తున్నట్లు చెప్పారు.



బాలల స్నేహ పూరిత గ్రామాలను నిర్మించాలి

ప్రతి ఒక్కరూ భాగ స్వాములు కావాలి

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి

ప్రజాశక్తి-అచ్చంపేట

బాల్య వివాహాలు జరక్కుండా ప్రజా ప్రతినిధులు, అధికారులు గ్రామాలలో అవగాహన కల్పించాలంటూ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి అన్నారు శనివారం మహిళాభివద్ధి శిశు సంక్షేమ శాఖ సిడిపిఓ పి స్వర్ణ కుమారి అధ్యక్షతన అచ్చంపేట , క్రోసూరు మండలాలకు సంబంధించి అచ్చంపేట సాయిబాబా కళ్యాణ మండపంలో బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా బేటి బచావో బేటి పడావో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా బి.పద్మావతి మాట్లాడుతూ బాలలకు సంబంధించిన చట్టాలు హక్కులు, బాల్య వివాహాల నిషేధం చట్టం 2006 మరియు జీవో ఎంఎస్ 31, 39 పై అవగాహన కల్పించారు క్రోసూరు ఎంపీపీ పి కోటయ్య మరియు కోసూరు జడ్పిటిసి జమీల గఫూర్ కపూర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు జరపడం అనేది సాంఘిక దురాచార్మని బాలల హక్కుల పరిరక్షణ కొరకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్య వ్యవస్థలో పలుమార్పులు చేసి బాలలందరూ చదువుకోవాలని అమ్మ వడి, విద్యాధీన, విద్యా వసతి వంటి పలు రకాల పథకాలు ఏర్పాటు చేసి బాలల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయటం జరుగుతుందని తెలిపారు.బాల్యవాహాలు జరగ కుండా ప్రతి గ్రామంలో సర్పంచ్లు జడ్పిటిసిలు ఎంపీటీసీలు గ్రామస్థాయి అధికారులు మండల స్థాయి అధికారులు నియోజకవర్గ స్థాయి అధికారులు కృషి చేయాల్సిందేనని అన్నారు.అమ్మాయి వయస్సు 18 సంవత్సరాలు అబ్బాయి వయస్సు 21 సంవత్సరాలు దాటిన తర్వాత మాత్రమే పెండ్లిన్లు చేయాలని సూచించారు. అనంతరం సిడిపిఓ స్వర్ణకుమారి మాట్లాడుతూ,ప్రీస్కూల్ విద్య కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన బడ్జెట్ కేటాయించిందని తెలిపారు.ఫోక్సో చట్టం ప్రకారం 14 సంవత్సరాల లోపు మైనర్ బాలికను పెళ్లి చేసుకున్న మేజర్ వరుడికి 20 సంవత్స రాలు, 16 - 18 సంవత్సరాల లోపు మైనర్ బాలికలను పెండ్లి చేసుకున్న వరుడుకి 10 సంవత్సరాల కఠినకారగార జైలు శిక్ష విధించబడునని అవగాహన కల్పించారు.



మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి- విజయపురిసౌత్

మాచర్ల మండలంలోని విజయపురి సౌత్ గ్రామంలో సాగర క్యాంపు మత్స్యకారులు, కోరాడ మురళి, బత్తిని కాశీ రావు అనారోగ్యంతో బాధపడుతున్న కారణంగా వారు చేపల వేటకు వెళ్లలేకపోతుండటంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈవిషయం తెలుసుకున్న మాచర్ల మండలం ప్రజా పరిషత్ అధ్యక్షులు బూడిద మంగమ్మ తనయుడు శ్రీనివాసరావు, ఒక్కో మత్స్య కార కుటుంబానికి రూ. 10,000 చొప్పున ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో మత్స్యకారుల ప్రెసిడెంట్ కారే ముసలయ్య, పూరి జగన్నాథ్, భూలోక అప్పలరాజు పాల్గొన్నారు.

నేడు పల్స్ పోలియో.. సర్వం సిద్ధం

ప్రజాశక్తి-మాచర్ల

ఆదివారం ఉదయం నుండి పట్టణంలో చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసే కార్యక్రమా నికి సర్వం సిద్ధం చేసినట్లు మున్సిపల్ కమిషనర్ దేవళ్ళ వెంకటదాసు తెలిపారు. పట్టణంలోని 34 పల్స్ పోలియో కేంద్రాలను శనివారం ఉదయం కమిషనర్ వెంకటదాసు సిబ్బందితో కలిసి తనిఖీ నిర్వహించారు.



మాచర్లలో పోలియో కేంద్రాలను పరిశీలిస్తున్న కమిషనర్ డి.వెంకటదాసు

కేంద్రాలలో ఏర్పాటు చేసే అన్ని పనులను ఇంజనీరింగ్ అధికారులతో కలిపి పరిశీలించారు. 0 నుండి 5 సంవత్సరాలలోపు చిన్నారులున్న తల్లి దండ్రులు వారి పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. అనంతరం పట్టణంలోని రింగ్ రోడ్డు నుండి మండాది రహదారి వైపుకు జరుగు తున్న పైపు లైను పనులను పరిశీలన చేశారు.

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పోలి యో చుక్కలు వేయించాలని కోరుతూ పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వ హించారు. ఈ ర్యాలీ స్థానిక ఎఎంజి వద్ద నుంచి పట్టణములో అన్ని ప్రధాన కూడళ్లలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఏఎంజి నర్సింగ్ కాలేజీ విద్యార్థులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సంయుక్తంగా పట్టణంలో అవ గాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎఎంజి నర్సింగ్ కాలేజీ విద్యార్థులు, అధ్యాపకులు, ప్రభుత్వ వైద్యు లు, వైద్య ఆరోగ్యశా ఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-రొంపిచర్ల

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ జరిగింది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి ర్యాలీ జరిగింది. 'పోలియో రహిత సమాజానికి సహకరిద్దాం, పల్స్ పోలియో జయప్రదం' చేయాలంటూ విద్యార్థులు, వైద్య సిబ్బంది నినాదాలు చేశారు. పల్స్ పోలియో పై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ ఎన్.సాయిబాబు,డాక్టర్ జగన్ నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-క్రోసూరులో

వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో క్రోసూరులో విద్యార్థినీ విద్యార్థులచే ప్రదర్శన నిర్వహించారు ఈ ర్యాలీ జిల్లా పరిషత్ హై స్కూల్ నుండి క్రోసూరు మెయిన్ బజార్ గుండా సాగింది.



చిలకలూరిపేటలో వైద్య ఆరోగ్యశాఖ ఎఎంజి నర్సింగ్ కాలేజ్ విద్యార్థుల సంయుక్త ర్యాలీ



రొంపిచర్లలో



క్రోసూరులో

కార్యక్రమంలో ఎంపీడీవో పీకే వెంకట రమణ ఈ ఓ ఆర్ డి శివరామయ్య వైద్యాధికారి మహమ్మద్ సాద్ సి హెచ్ ఓ సాంబశివరావు ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ హెల్త్ సూపర్వైజర్ శివుడు హై స్కూల్ ఉపాధ్యాయులు డి.బాబురావు కె రామాంజనేయులు, ఆర్ శ్రీధర్ ఆరోగ్య కార్యకర్త లావణ్య పాల్గొన్నారు.



విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-మాచర్ల

విద్యార్థులు తమకు ఉన్న విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే మంచి మార్కులు సాధిస్తారని కెసిపి సిమెంట్ ఫ్యాక్టరీ సీనియర్ జనరల్ మేనేజర్ వివి రమణ అన్నారు. ఇటీవల 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రీ ఫైనల్‌లో ప్రతిభ కనపర్చిన ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలల విద్యార్థులలోని లోపాలను సరి చేసి రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించేలా ప్రోత్సహించేందుకు శని, ఆదివారాలలో స్థానిక కిడ్స్ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన వివి రమణ మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయుల సలహాలను పాటించడం ద్వారా తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు వస్తుందని వివరించారు. మరో ముఖ్యఅతిథి ఎం.ఇ.ఓ వేముల నాగయ్య మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యశిస్తే తప్పక రాణిస్తారని వివరించారు. కార్యక్రమంలో తాళ్ళపల్లి హైస్కూల్ హెచ్ఎం శ్రీనునాయక్, కిడ్స్ పాఠశాల హెచ్ఎం జెవిఎన్ శాస్త్రి, జడ్పి బాలుర హైస్కూల్ హెచ్ఎం రామారావు, ప్రవేట్ పాఠశాలల అధ్యక్షులు రమణ తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి - నరసరావుపేట

స్థానిక కేసానుపల్లిలోని ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఒమేగా హెల్తకేర్ బెంగుళూరు కంపెనీ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూ నిర్వహించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డా. జి.నాగ మల్లేశ్వరరావు తెలియజేసారు.132 మంది పాల్గొన్న ఈ ఇంటర్వ్యూ లో 21 మంది 3.20 లక్షలు వార్షిక ఆదాయంతో ఉద్యోగ అవకాశం పొదారని అయన తెలియజేసారు.కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్.ఖరీమ్ మొహిద్దీన్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో కళాశాలలో ఇంకా ఎక్కువగా క్యాంపస్ ఇంటర్వ్యూ లు నిర్వహిస్తామని విద్యార్థులు అందరూ అవకాశాలను అందిపుచ్చుకొని ఉద్యోగ అవకాశాలు పొందాలని కోరారు. ఉద్యోగ అవకాశాలు పొందిన విద్యార్థులను కళాశాల చైర్మన్ షేక్. మీరావాలి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్లేస్మెంట్ ఆఫీసర్ షేక్. ముజీర్, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఉద్యోగావకాశాలు పొందిన విద్యార్థులతో అధ్యాపకులు

అచ్చంపేట సర్పంచ్ గా షేక్ జానీ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-అచ్చంపేట

అచ్చంపేట గ్రామ సర్పంచ్ గా షేక్ జానీ శనివారం ప్రమాణ స్వీకారం చేశారు స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకర్రావు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు పంచాయతీ కార్యదర్శి ఏవి సుబ్బారావు జానీ చేత ప్రమాణ స్వీకారం చేయిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అచ్చంపేట గ్రామంలో రూ.50 కోట్ల రూపాయలతో అభివద్ధి పనులు చేశామన్నారు అంతేకాకుండా నవరత్నాల్లో భాగంగా వివిధ పథకాలు గ్రామ ప్రజలకు అందించామన్నారు.



ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రంలో సందర్శన

ప్రజాశక్తి-యడ్లపాడు

మండలం లోని వంకాయలపాడు గ్రామ పంచాయితి ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని నెదర్లాండ్స్ బృందం సందర్శించింది ఐటిసి బంగారు భవిష్యత్తు, సెర్ఫ్ సంస్థ ఆధ్వర్యంలో ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని నెదర్లాండ్స్ బృందం సభ్యులు సీనియర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జెస్సికా, ఐడిహెచ్ సీనియర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ (ఇండియా) వరుణ్, ఐటిసి క్రాఫ్ బృందం దామోదర్, నారాయణస్వామి శనివారం సందర్శిం చారు. వ్యర్థాల నిర్వహణ కార్యక్రమం కార్యక్రమం జరుగుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. వంకాయలపాడలో తడి,పొడి ప్రమాదకర వ్యర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు ఈ కార్యక్రమ సమన్వయకర్త జి.కృష్ణ, సిహెచ్ శ్రీనివాస్ తెలిపారు.

ఈ కార్యక్రమం సక్రమంగా అములు చేయుట ద్వార గాలి నీరు భూమి కలుష్యం నివారణ చేయొచ్చు దీనివల్ల ప్రజల ఆరోగ్యం, ఆయుష్షు పెరుగుతాయని అన్నారు.కార్యక్రమలో యడ్లపాడు ఈఓపీఆర్డీ వరూధిని, వంకాయలపాడు సర్పంచ్ నరసింహారావు, పంచాయతి కార్యదర్శి సాంబశివ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
గుంటూరు 5
ఆదివారం 3 మార్చి 2024

20వ తేదీ వరకూ ఎంఎస్ఎంఇల సర్వే

ప్రజాశక్తి-గుంటూరు:సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమల పనితీరు మెరుగుపర్చి, ప్రోత్సహించాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం ఎంఎస్ఎంఈల సర్వేను నిర్వహిస్తుందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎంఎస్ఎంఈల సర్వే యాప్, ప్రచారపోస్టర్‌ను పరిశ్రమల శాఖ అధికారులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంఎస్ఎంఈల అభివృద్ధిని వేగవంతం చేయడం కోసం ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహకారంతో కేంద్ర ప్రభుత్వం ర్యాంప్ అనే స్కీమును ప్రకటించిందని, మన రాష్ట్రంలో పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఫిబ్రవరి 14న ర్యాంప్ స్కీమును, ఏపీఎంఎస్ఎంఈ వన్ అనే ఏకీకత పోర్టల్‌ను కూడా ప్రారంభించారన్నారు. ర్యాంప్‌లోని ఒక అంశమైన ఎంఎస్ఎంఈల ఫార్మలైజేషన్‌లో జిల్లాలోని ఎంఎస్ఎంఈలను సర్వే చేయటానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.ఈ సర్వే ద్వారా తయారీ, సేవ, వాణిజ్య రంగాలలోని అన్ని ఎంఎస్ఎంఈలను సర్వే చేసివాటి వివరాలను డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోకి తీసుకువచ్చి ఏపీ ఎంఎస్ఎంఈ వన్ పోర్టల్‌కు అనుసంధానించడం జరుగుతుందన్నారు. పరిశ్రమల శాఖ, ఎంఎస్ఎంఈ డెవలప్మెంట్ కార్పొరేషన్ సహకారంతో నిర్వహించే ఈ సర్వే కోసం ఎంఎస్ఎంఈ సర్వే అండ్ సపోర్ట్ అనే మొబైల్ యాప్‌ను రూపొందించడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పట్టణ ప్రాంతాలలో వార్డు ఎమినిటీ సెక్రటరీలు ఈసర్వేను మార్చి 1 నుండి 20వ తేదీ వరకూ చేస్తారన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారులతోపాటు ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, అడిషనల్ డెవలప్మెంట్ కమిషనర్ల సర్వే పురోగతిని నిరంతరం పర్యవేక్షించటం జరుగుతుందన్నారు. ఎంఎస్ఎంఈల డేటాబేస్‌ను అభివృద్ధి చేయడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై అవగాహన కల్పించడం, మహిళలు, ఎస్టీ, ఎస్సీ పారిశ్రామికవేత్తల నైపుణ్యాలను అభివద్ధి పరచటం, సర్వేలో గుర్తించిన నమోదు కాని ఎంఎస్ఎంఈలకు అవగాహన శిబిరాలు నిర్వహించడంతో ప్రభుత్వ ప్రోత్సాహకాలను పొందేందుకు అర్హత కల్పించటం, బ్యాంకు రుణసదుపాయాలు సులభతరం తదితర ప్రయోజనాలు సర్వే వలన సాధ్యం అవుతుందన్నారు. కావున ఎంఎస్ఎంఈ అసోసియేషన్లు, ఇతర పరిశ్రమల అసోసియేషన్లు, వర్తక, వాణిజ్యసంఘాలు సర్వేటీమ్‌లకు సహకరించి సర్వేకు అవసరమైన వివరాలు అందించి సర్వేను విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు మదన మోమన్ శెట్టి, డిప్యూటీ డైరక్టర్ సుధాకర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ గోపికష్ణ, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, తదితరులు

ఎంఎస్ఎంఇ సర్వేకు సహకరించండి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ సర్వేకు సహకరించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి కోరారు. శనివారం జిల్లా పరిశ్రమల శాఖ అధికారులతో కలిసి ఎంఎస్ఎంఈ సర్వే పోస్టర్ ని నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ర్యాంప్ స్కీం ద్వారా ఎంఎస్ఎంఈ ఏకీకత పోర్టల్ ప్రారంభించిందని, ర్యాంప్‌లోని ఒక అంశమైన ఎంఎస్ఎంఈ ఫార్మలైజేషన్‌లో భాగంగా పరిశ్రమల శాఖ ఈ నెల 1 నుండి 20 వరకు సర్వే నిర్వహిస్తుందని తెలిపారు. జిల్లాలోని పరిశ్రమలకు ఎంఎస్ఎంఈ వన్ పోర్టల్ ని అనుసంధానం చేయడం కోసం జరిగే సర్వేలో నగరంలోని అన్ని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మదన్ మోహనశెట్టి, డిడి ఎం.సుధాకర్, జోనల్ మేనేజర్ గోపి కష్ణ పాల్గొన్నారు.



ప్రదర్శనను తిలకిస్తున్న చిన్నపరెడ్డి

శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధే దేశాభివృద్ధి

ప్రజాశక్తి-గుంటూరు

భారత దేశాన్ని వైజ్ఞానిక, శాస్త్ర, సాంకేతిక రంగాలలో ప్రపంచంలో అగ్ర దేశాలలో ఒకటిగా నిలిపే బాధ్యత బావి భారత పౌరులైన విద్యార్థులపైనే ఉన్నదని నవీన విద్యాసంస్థల చైర్మన్ ఏరువ చిన్నపరెడ్డి పేర్కొన్నారు.స్థానిక నగరాలు నవీన హైస్కూల్‌లో విద్యార్థులతో రూపుదిద్దుకున్న ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, బోటనీ, జువాలజీ సంబంధించిన 100కుపైగా ప్రదర్శనలు సైన్స్ ఎగ్జిబిషన్ ద్వారా ప్రదర్శించారు. రాకెట్స్, లాంచింగ్ స్టేషన్స్, ఉపగ్రహాలు, రోబోటిక్స్, డ్రోన్స్ సోలార్, ఏకో ఫ్రెండ్లీ హౌసెస్ తోటి విద్యార్థులను తల్లిదండ్రులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఏరువ చిన్నమ్మ, డైరెక్టర్లు నవీన్ రెడ్డి, ఆనంద్‌రెడ్డి, మాధవి, సునీత, ప్రధానోపాధ్యాయులు అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలకులకు పట్టని బాధిత పసుపు రైతుల సమస్య

40రోజులు గడుస్తున్నా పరిహారం అందని వైనం - రెండోరోజుకు పసుపు రైతుల రిలే దీక్షలు

ప్రజాశక్తి దుగ్గిరాల

ప్రమాదం జరిగి 42 రోజులు గడిచినా ప్రభుత్వం నుండి ఇంతవరకు ఎటువంటి స్పందన లేదని, రైతులంటే ఇంత చులకన అని పసుపు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకర్ తీవ్ర అసంతప్తిని వ్యక్తం చేశారు. దుగ్గిరాలలో శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ పసుపు బాధితుల రిలే నిరాహార దీక్షలు రెండో రోజు శనివారం కొనసాగాయి. ఈ సందర్భంగా జొన్నా శివశంకర్ మాట్లాడుతూ ఎంపీలను, మంత్రి నాగార్జునను కలసి సమస్యను తెలియజేసినప్పటికీ ఎవరు స్పందించడం లేదన్నారు. రూ.5 వేలకు బీమా చేయించారు. ప్రస్తుత పసుపు క్వింటా ధర రూ.13000 ఉందని, తేడా మొత్తాన్ని రైతులకు కోల్డ్‌స్టోరేజ్ యాజమాన్యం ఇవ్వాలని లేని పక్షంలో ప్రభుత్వం ప్రకృతి విపత్తుల నిధి నుండి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రోడ్లు దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు. తెలుగు రైతు సంఘం గుంటూరు నియోజకవర్గం అధ్యక్షులు కల్లం రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ దశలవారీగా ఉద్యమం చేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధుల్లో స్పందన లేదన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ దృష్టికి ఈ విషయం తీసుకెళ్లగా ఆయన చంద్రబాబు నాయుడు దగ్గరికి ఈ విషయం తీసుకెళ్లారు చంద్రబాబు నాయుడు సీఈఓ కు లేఖ రాసి త్వరతగతిన రైతుల సమస్యలు పరిష్కరించి బాధితులను ఆదుకోవాలని లేఖ రాశారన్నారు. కోల్డ్ స్టోరేజ్ యజమాని మరియు యార్డు సిబ్బంది ఇచ్చిన నివేదికలో 30 వేల బస్తాలు తేడా ఉన్నది ఈ విషయమై అధికారులతో చర్చిస్తామన్నారు. ప్రస్తుత ధరల ప్రకారమే బాధితులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే ముమ్మినేని వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ప్రమాదంలో నష్టపోయిన రైతులందరూ స్పందించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. శనివారం ఎమ్మెల్సీ లక్ష్మణరావు దీక్ష శిబిరం వద్దకు వచ్చి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పసుపు రైతు కమిటీ కన్వీనర్ వి వెంకటరామయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం శివ సాంబి రెడ్డి, వై బ్రహ్మేశ్వర రావు, యార్లగడ్డ శివయ్య, షేక్ జానీ, సిహెచ్ పోతురాజు రైతులు డి నాగ వీర బసవయ్య, బొబ్బ సురేష్, పానకాల రెడ్డి, ఎల్ నాగేశ్వర్రెడ్డి, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జొన్నా శివశంకర్

అగ్నిప్రమాద ఘటన లెక్కల్లో పలు అనుమానాలు

ప్రజాశక్తి- తెనాలిరూరల్ :దుగ్గిరాల శుభం పరమేశ్వరి కోల్డ్ స్టోరేజిలో అగ్ని ప్రమాదం సంభవించి 44 రోజులు గడుస్తున్నా నష్టపోయిన పసుపు రైతులకు నష్టపరిహారం చెల్లించకపోవడం అన్యాయమని పసుపు రైతుల సంఘం రాష్ట్ర కమిటి సభ్యులు ములకా శివ సాంబిరెడ్డి అన్నారు. ఘటనలో రైతులకు జరిగిన నష్టానికి నిరసనగా ఆదివారం దుగ్గిరాల ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించనున్నట్లు తెలిపారు. మార్కెట్ యార్డ్ అధికారులు, కోల్డ్ స్టోరేజీ యాజమాన్యం, వెల్లడించిన వివరాల లిస్టులో 30 వేల బస్తాలు తేడా రావడం పలు అనుమానాలకు తావిస్తుందని పేర్కొన్నారు. అధికారులు మీడియేటింగ్ చేయకుండా నిర్లిప్తంగా వ్యవహరించడం సోచనీయమన్నారు. నేడు జరగనున్న రాస్తారోకో కార్యక్రమంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

జిఎంసి ఎన్నికల సెక్టోరల్ అధికారులకు శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారులది కీలకపాత్ర అని, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు సెక్టోరల్ అధికారుల ఎన్నికలు సజావుగా జరగడానికి భాధ్యత తీసుకోవాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్ఓ కీర్తి చేకూరి తెలిపారు. సాదారణ ఎన్నికల విధులపై సెక్టోరల్, రూట్ అధికారులకు అదనపు కమిషనర్ పశ్చిమ నియోజకవర్గ ఈఆర్ఓ కె.రాజ్యలక్ష్మితో కలిసి శనివారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 22 మంది సెక్టోరల్, 22 మంది రూట్ అధికారులకు విధులు కేటాయించారు. ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చిన నాటి నుండి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులోకి వస్తుందని, సెక్టోరల్ అధికారులు ముందుగా తమకు కేటాయించిన ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలన్నారు. సెక్టోరల్ అధికారులు ముందుగా ఎన్నికల సంఘం నిబంధనలు, మార్గాదర్శకాలతో కూడిన హ్యాండ్ బుక్ ని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ఓ నిరంజన్, ఏఈఆర్ఓ ప్రదీప్ కుమార్, మేనేజర్ శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్య పరిష్కరించరూ...

ప్రజాశక్తి-తాడేపల్లి

అందమైన బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం జరుగుతున్న సిఆర్‌డిఎ పరిధిలో మురుగు సమస్య వెంటాడుతోంది. తాడేపల్లి పట్టణంతో పాటు ఉండవల్లిలో ఈ సమస్య ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులకు శాపంగా మారింది. ముఖ్యంగా అమరావతి రోడ్లో పంట కాలువ దాటిన తరువాత తాజ్ ప్యారడైజ్ అపార్టుమెంట్‌కు మురుగు పోయే దారి లేక ఇంటి ముందే గొయ్యి తవ్వి అపార్టుమెంట్లలోని ప్లాట్లలో వాడిన నీటిని గుంతలోకి తరలిస్తున్నారు. రెండు రోజులకోసారి ట్యాంకర్ల ద్వారా మురుగునీటిని తోడిస్తున్నారు. ఇందుకు నెలకు రూ.12 వేలు ఖర్చు అవుతుందని ప్లాట్ల యజమానులు చెబుతున్నారు. అపార్టుమెంట్ నిర్మాణం జరిగిన 12 సంవత్సరాలు అవుతున్నా అధికారులు మురుగునీటి సమస్య పరిష్కారానికి ముందుకు రాకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నాలా పన్నుతో పాటు అప్పట్లో విజయవాడ, గుంటూరు, తెనాలి ఉడా అనుమతులు పొందడానికి డ్రైనేజీ రుసుం కింద అపార్టుమెంట్ వాసులు లక్షల్లో పన్నులు చెల్లించారు. పన్నులు వసూలు చేసే దాని మీద ఉన్న శ్రద్ధ మురుగు సమస్యను పరిష్కరించే దాంట్లో లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ అయిన తరువాత అయినా తమ సమస్య పరిష్కారం అవుతుందని ఆశించినా తాజ్ ప్యారడైజ్ వాసులకు అసంతృప్తి మాత్రమే మిగిలింది. విజయవాడ, అమరావతి రోడ్లో పెద్దఎత్తున అపార్టుమెంట్ల సంస్కృతి విస్తరించిన నేపథ్యంలో మురుగు సమస్య పరిష్కారం కాకపోవడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మురుగునీరు రోజుల తరబడి నిల్వ ఉండటంతో దుర్వాసనతో ఆ ప్రాంత ప్రజలు అల్లాడి పోతున్నారు. సీజన్ మారి వాతావరణంలో మార్పులు వచ్చిన ప్రతీసారి ఎప్పుడు ఏ రోగం వస్తుందోనని అపార్టుమెంట్ల వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాజ్ ప్యారడైజ్‌తో పాటు చుట్టుపక్కల ఉన్న అపార్టుమెంట్ వాసుల మురుగు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

పల్స్ పోలియోకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి తెనాలి

పట్టణంలో ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తయినట్లు జిల్లా ఉప వైద్యారోగ్యాధికారిణి డాక్టర్ ఇ అన్నపూర్ణ తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడుతూ పట్టణంలోని ఆరు అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో పుట్టిన బిడ్డనుండి 5 సంవత్సరాల లోపు పిల్లలు 12,723 మంది ఉన్నారని, వారికి పోలియో చుక్కలు వేసేందుకు 6 రూట్లుగా విభజించి 60 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా మొబైల్ ట్రాన్సిట్ పాయింట్లను కూడా గుర్తించి సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు వినియోగించుకోవాల్సిందిగా కోరారు. మున్సిపల్ కార్యాలయంలోని వ్యాక్సిన్ భద్రపరిచిన రిఫ్రిజిరేటర్లను ఆమె పరిశీలించారు. ఆమె వెంట ఆరోగ్య సిబ్బంది ఎ బాలచంద్రమౌళి, సిహెచ్ ప్రమీల, పుష్పలత, డి విజయకుమారి, ఉన్నారు.

విద్యార్థులూ..కృషి చేయండి

10 వ తరగతి మెరిట్ విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో 10 వ తరగతి చదువుతున్న మెరిట్ విద్యార్థులతో శనివారం డే విత్ కలెక్టర్ కార్యక్రమాన్ని కలెక్టర్ ఎల్.శివశంకర్ అధ్యక్షతన నిర పూర్వకంగా వివరాలు సేక రించారు. సాఫ్ట్ వేర్, ఐ.ఎ.ఎస్,ఐపిఎస్, డాక్టర్లు, చార్టర్డ్ అకౌంట్, ల్లాయర్, వ్యాపారం, టీచర్లు తదితర అంశాలపై వారి అభిప్రాయలను తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వార అభిప్రాయాలకు



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థినులు

హించారు. ఈ కార్య క్రమంలో అమరావతి, పెదకూరపాడు, చిలకలూరిపే ఎట తదితర ప్రాంతాలనుండి వచ్చిన విద్యార్థినీవిద్యార్థులు 241 మందికి పైగా పాల్గొన్నారు. విద్యార్థుల అభిప్రాయాలు లక్ష్యాలు తదితర అం శాలపై రాత తగ్గట్టుగా ఏయే పరీక్షలు ఎలా రాయాలి, ఎలా సన్నద్ధం కావాలి అనే విషయాలను వివరించారు.5 తరగతి చదివేటప్పుడు నుండి ఐ.ఎ.ఎస్. పై మక్కువ ఏర్పడిం దని 10 వ తరగతి వరకు బట్టీ పట్టి చదివే వాడినని , తదుపరి అర్థం చేసుకొని చదవడం మొదలు పెట్టానని తెలిపారు. 'మీరు కలెక్టర్ కావడానికి స్ఫూర్తి ఎవరు?' అని అడిగిన దానిపై కలక్టర్ స్పందిస్తూ చాలామంది ఉన్నారని ఒక్కొక్కరిది ఒక్కోరకం అందులో ముఖ్యంగా ధామస్ ఆల్వా ఎడిసన్, యండమూరి వీరేంద్ర నాద్, స్వామి వివేకానంద, చిరంజీవి, కష్ణుడు, ధర్మరాజని, ధామస్ ఆల్వా ఎడిసిన్ ద్వారా ప్రయత్నాన్ని విస్మరించక ుండా అవిరళ కృషి ముఖ్యమని గుర్తిం చానని చెప్పారు. అలాగే, నాలుగు సార్లు సివిల్ సర్వీసెస్ ఫెయిల్ అయినప్పటికీ 5వ సారి ఉత్తీర్ణత సాధించడం జరిగిం దన్నారు. ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ అబ్దుల్ కలాం పుస్త కాలు చదివి స్ఫూర్తిచెందానని తెలిపారు. తానూ చిన్నపుడు పడ్డ కష్టాలు, తెలియని విషయాలు ఇప్పటి పిల్లలకు వివరించాలని 'డే విత్ కలెక్టర్'కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు పలు ప్రశ్నలు జిల్లా కలెక్టర్ కు సంధించి సమాధానాలు రాబట్టారు. తోలుత యన్.ఈ.సి ఇంజనీరింగ్ కాలేజి ప్రినిపాల్ శ్రీనివాస కుమార్ మాట్లాడుతూ 10 వ తరగతి పరిక్షలకు ఎలా సన్నద్ధం కావాలనే దానిపై విద్యార్థులుకు స్ఫూర్తి కలిగించారు. మొబైల్ వాడకం తగ్గించాలని, ప్రశాంత వాతావరనం, చదివింది గుర్తు పెట్టు కోవడం ముఖ్యమని అన్నారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా విద్యా శాఖాధికారి ఎం. వెంకటేశ్వర్లు, ఉప విద్యా శాఖాధికారి వేణు గోపాల్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం శంకరభారతి పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్దినిలు పల్నాడు జిల్లా పాట కు వేసిన నృత్య రూపకం ఎంతగానో ఆకట్టుకుంది.



విద్యార్థులతో ప్రమాణం చేస్తున్న కలెక్టర్, ట్రైనీ కలెక్టర్ తదితరులు




పేదల ఆరోగ్యానికి సిఎం రిలీఫ్ ఫండ్ భరోసా

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి

ప్రజాశక్తి- మాచర్ల

అత్యవసర పరిస్థితులలో నగదుతో వైద్యం చేయించుకున్న పేదలకు సిఎం రిలీఫ్ ఫండ్ వారిని ఆర్థికంగా నష్టపోకుండా ఆదుకుంటుందని ప్రభుత్వ విప్, పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ విప్ కార్యాలయంలో శనివారం 10 మంది లబ్దిదారులకు రూ 10.54లక్షల విలువైన చెక్కులను అందజేశారు. రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి భరోసాగా ఆరోగ్యశ్రీ పథకం ఉందన్నారు. కొన్ని అత్యవసర సందర్భాలలో నగదుతో వైద్యం చేయించుకున్న పేదలను ఆర్థికంగా నష్టపోకుండా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకోని వారికి భరోసా ఇస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తురకా కిషోర్ తదితర నాయకులు, లబ్దిదారులు పాల్గొన్నారు.



లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు

ప్రజాశక్తి-పెదకూరపాడు

వివిధ కారణాలతో సహాయం కోసం ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ కోసం ఆశ్రయించిన లబ్దిదారులకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చెక్కులు అందజేశారు. శనివారం పెదకూరపాడు మండలం గారపాడుకు చెందిన వేములరి మల్లిఖార్జునరావు కు రూ.2 లక్షలు,పెదకూరపాడు మండలం రామాపురం గ్రామానికి చెందిన సుంకర అచ్చయ్యకు రూ.1.30 లక్షలు, అమరావతి మండలం లింగాపురం గ్రామానికి చెందిన చిరుమామిళ్ల కృష్ణమూర్తికి రూ.1.10 లక్షలు, క్రోసూరుకు చెందిన చిలకా రెబ్బమ్మకు రూ.40 వేలు, క్రోసూరు మండలం 75 తాళ్లూరుకు చెందిన ఊర అఖిల్ కు రూ.22 వేలు, పెదకూరపాడు మండలం కంభంపాడుకు చెందిన గోగులపాటి యశ్వంత్ కు రూ.35 వేలు, పెదకూరపాడుకు చెందిన ఆల రాణి గంగమ్మకు రూ.18 వేలు, క్రోసూరుకు చెందిన బోడె అప్పారావుకు రూ.65 వేలు, పెదకూరపాడు మండలం బలుసుపాడుకు చెందిన ఏపూరి నాగేశ్వరరావు కు రూ.50 వేలు, పెదకూరపాడు మండలం లింగంగుంట్లకు చెందిన ఎండ్లూరు ఠాగూర్ చౌదరికి రూ.40 వేలు, పెదకూరపాడు మండలం పాటిబండ్లకు చెందిన సయ్యద్ రహీమ్ కు రూ.75 వేలు, గుంటూరుకు చెందిన కన్నుగంటి ఏకోబుకు రూ. 60 వేలు అందించారు.

రెవిన్యూ అధికారుల తీరు నిరసిస్తూ రేపు నిరసన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వినుకొండ మండలం బ్రాహ్మణపల్లి రెవిన్యూ గ్రామ భూముల రీసర్వేలో అక్రమాలకు పాల్పడిన రెవిన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు భారత్ బచావో జిల్లా అధ్యక్షులు వి.కోటా నాయక్, పిడియం జిల్లా కార్యదర్శి జి.రామకష్ణ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ప్రజా సంఘాల కార్యాలయంలో వారు మాట్లాడుతూ కోర్టు వివాదాల్లో ఉన్న భూములను ఆన్లైన్ లో నమోదు చేయడం చట్టవ్యతిరేకమన్నారు.

అమూల్ డెయిరీ వద్ద రైతుల ఆందోళన

ప్రజాశక్తి-నూజెండ్ల



మండలంలోని అమూల్ డైరీ వద్ద కొన్ని గ్రామాలకు చెందిన రైతులు ఆందోళన చేపట్టారు. తమకు వచ్చే ప్రతి బిల్లులో 15 నుంచి 20 శాతం తగ్గించి వేస్తున్నారని రైతులు వాపోయారు. కేవలం అమూల్ డైరీని అప్రతిష్టపాలు చేయడానికి కొంతమంది ఇలా చేస్తున్నారని రైతులు తెలిపారు. దీనిపై డైరీ సిబ్బందిని రైతులు అడగ్గా తగ్గించినవి తిరిగి చెల్లించడం జరగదని, భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చూసుకుంటామని అన్నారని ఆవేదన చెందారు.

పదో తరగతి విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



ప్రభుత్వ పాఠశాలల్లో 10 వ తరగతి చదువుతున్న విద్యార్థులు రాబోయే ఎస్ ఎస్ సి పబ్లిక్ పరీక్షలలో అత్యుత్తమ ర్యాంకులు సాధించాలనే లక్ష్యంతో నరసరావుపేట డివిజన్ స్థాయిలో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారి కె.వేణుగోపాలరావు అన్నారు.పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట సింధు ఇంగ్లీషు మీడియం స్కూల్ లో శని ఆదివారాలలో రోజుల పాటు 10 తరగతి విద్యార్థులకు జరగనున్న అవగాహన సదస్సు లోని అంశాలను సద్వినియోగం చేసుకుని పరీక్షలలో మంచి మార్కులు ర్యాంకులు సాధించాలన్నారు. ఉత్తమ ర్యాంకుల సాధన కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందన్నారు. నరసరావుపేట సింధు స్కూల్ తో పాటు చిలకలూరిపేట చైతన్య లిటిల్, వినుకొండ లయోలా హై స్కూల్, మాచర్ల కిడ్స్ పాఠశాలలో ఏకకాలంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

టిడిపి-జనసేన నిరసనలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట



విపరీత కాలే వినాశ బుద్ధి అంటూ జగన్ ప్రభుత్వం ప్రవర్తిస్తున్న తీరుపై తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు చిలకలూరిపేటలో కదం తొక్కారు. స్థానిక పండరీపురంలోని పత్తిపాటి పుల్లారావు నివాసం వద్ద శనివారం నాడు ఉభయ పార్టీల నాయకులు కార్యకర్తలు మాట్లాడారు. మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్ అక్రమ అరెస్టును నిరసిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వారు పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగించారు. ప్రత్తిపాటిపై గెలవలేము అన్న ఒకే ఒక్క అక్కసుతో ఆయన కుటుంబ సభ్యుల్ని లక్ష్యంగా చేసుకున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో సాగుతున్న అరాచక పాలనకు నిదర్శనంగా కళ్లకు గంతలు కట్టుకుని చిలకలూరిపేటలో నిరసనలు తెలిపారు. దాచేపల్లిలో రా... కదిలిరా.. బహిరంగ సభకు తరలివెళ్లే ముందు చిలకలూరిపేటలోని ప్రత్తిపాటి పుల్లారావు నివాసం వద్ద టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. నల్లబ్యాడ్జీలు ధరించి ప్లకార్డులు ప్రదర్శిస్తూ సీఎం జగన్, వైకాపా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. జగన్ ప్రైవేటుసైన్యంగా మారిన పోలీసుల అక్రమనిర్బంధం నుంచి శరత్‌ను విడిచిపెట్టే వరకు తమ నిరసనలు, ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

ప్రజాశక్తి-చిలకలూరిపేట : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశముల మేరకు శనివారం నాడు స్థానిక తహశీల్దారు కార్యాలయంలో ఓటర్ల నమోదు అధికారి అధ్యక్షతన నియోజకవర్గ పరిధిలోని అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పోలింగు కేంద్రముల మార్పులు మరియు చేర్పులపై సమావే శము పై నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట, ఎడ్లపాడు మండలాల తహశీల్దారు, మున్సిపల్ కార్యాలయము నుండి టిపిఎస్, ఎన్నికల సిబ్బంది, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల్యేన బిఎస్పి తరపున యన్.కోటేశ్వరరావు, సి.పి.ఐ. తరపున యన్.రామసుబ్బాయమ్మ , సి.పి.ఐ(యం) తరపున పెరుబోయిన వెంకటేశ్వర్లు., 4)ఇండియన్ లేబర్ పార్టీ తరపున మూకిరి కోట,ఐ.యన్.సి. పార్టీ తరపున యం.రాధాకృష్ణ, జనసేన పార్టీ తరపున కె.సాంబ,నవతరం పార్టీ తరపున రావు రామసుబ్రహ్మణ్యం, టిడిపి తరపున మురకొండ మల్లికార్జున రావు., 9) వైయస్సార్ సిపి పార్టీ తరపున రవి శ్రీనివాస రావు మరియు చల్లా యగ్నేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'వైట్ కాలర్ క్రిమినల్ ప్రత్తిపాటి పుల్లారావు'

ప్రజాశక్తి-చిలకలూరిపేట

తెలుగుదేశం ప్రభుత్వంలో ఐదు శాఖల మంత్రిగా పనిచేసిన ప్రత్తిపాటి పుల్లారావు అధికారాన్ని అడ్డం పెట్టుకుని వైట్ కాలర్ క్రిమినల్‌గా అవతరించారని వైసిపి చిలకలూరిపేట నియోజవకర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు ఆరోపించారు. పార్టీ ఎన్నికల కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ కక్షతో అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని ప్రత్తిపాటి పుల్లారావు, తెలుగుదేశం పార్టీ నేతలు ప్రభుత్వంపై బురదజల్లి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసిన ఘటనలను ఆయన తీవ్రంగా ఖండించారు. నీతి, నిజాయతీ పరులమని రోడ్డెక్కి గగ్గోలు పెడితే భయపడేవారు ఎవరూ లేరని అన్నారు. అధికారంలో ఉన్న మేము ఇబ్బంది పెట్టాలంటే ప్రత్తిపాటి పుల్లారావును నాలుగు సంవత్సరాలక్రితమే ఇబ్బంది పెట్టేవాళ్లమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ధర్యాప్తు సంస్థలు పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి పూర్తి ఆధారాలతో చట్టపరమైన చర్యలకు పాల్పడ్డాయని వివరించారు. పుల్లారావు ఇక నుంచైనా తన తీరు మార్చుకోవాలని అన్నారు.

న్యాయశాస్త్రానికి సమాజానికి అంతర్గత సంబంధం ఉంది

ఎపి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్

ప్రజాశక్తి, తాడేపల్లి రూరల్

కెఎల్ డీమ్డ్ యూనిర్శిటీలోని న్యాయకళాశాల అధ్వర్యంలో ప్రోబోనో క్లబ్ ను శనివారం ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రామకష్ణ ప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయిన ఆయన విద్యార్థులనుద్దేశించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయ శాస్త్రానికి సమాజానికి అంతర్గత సంభాధాలు ఉన్నాయన్నారు. ప్రాథమిక హక్కులు పుట్టినప్పటినుంచి మనకు ఉన్నాగాని, అవి రాజ్యాంగంలో పొందుపరిచిన తరువాతనే తప్పనిసరి చేయబడ్డాయన్నారు. కెఎల్ వర్శిటీలోని న్యాయ కళాశాల విద్యార్దులు న్యాయ శాస్త్రాల, సమాజం పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం ప్రోబోనో లోగోను, పుస్తకాన్ని ఆవిష్కరించారు. వర్శిటీ విసి. డాక్టర్ జి.పార్ధసారదివర్మ మాట్లాడుతూ తమ వర్శిటీలో చదువుతున్న విద్యార్దులు అన్ని రంగాలలో రాణించాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఇప్పటికే ఇంజనీరింగ్



విద్యలో దూసుకుపోతున్న కెఎల్ వర్శిటీ, న్యాయ శాస్త్ర విభాగంలో కూడా ముందంజలో ఉందన్నారు. అందులో బాగంగానే ప్రజలకు న్యాయ సేవలను అందించాలనే ఉద్దేశ్యంతో ప్రో బోనో క్లబ్ ను స్థాపించామన్నారు. ఈ క్లబ్ ద్వారా సాదారణ ప్రజలకు న్యాయం గురించి, చట్టాల గురించి అవగాహన కల్పించడంతో పాటుగా గ్రామీణ ప్రాంతాల్లోని సాదారణ ప్రజలకు న్యాయసేవలను అందిస్తామని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథి ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రామకష్ణ ప్రసాద్ ను విసి డాక్టర్ జి.పార్ధసారదివర్మ, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు లు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు , బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కెబి.సుందర్, గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.సురేష్ కురివెళ్ల, కేంద్ర న్యాయ శాఖ ప్రోగ్రాం మేనేజర్ స్నేహ శర్మ, కెఎల్ వర్శిటీ విసి. డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రో వైస్ చాన్సులర్లు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు, కెఎల్ న్యాయ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పవన్ కుమార్, విభాగాధిపతి విజయసుధ, ఆచార్యులు డాక్టర్ కామసాయి, అసిస్టెంట్ ఆచార్యురాలు, ఆర్.చాందిని చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు ఆరోగ్య పరీక్షలు అనివార్యం

ప్రజాశక్తి తెనాలి

మారుతున్న ఆహారపు అలవాట్ల ద్వారా వయోభేదం లేకుండా విస్తరిస్తున్న వ్యాధులను ముందస్తు పరీక్షలతో గుర్తించడం ద్వారా ప్రాణాపాయం తప్పించుకోవచ్చని శారద సర్వీస్ సొసైటీ నిర్వాహకులు డాక్టర్ డి శారద చెప్పారు. స్థానిక వహాబ్ రోడ్డు లోని సత్యసాయి నర్సింగ్ హోమ్ లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సొసైటీ ద్వారా స్వచ్ఛందంగా ధర్మ సంచార ఎన్సిడిఎస్ స్క్రీనింగ్ వాహనం ద్వారా సబ్ కలెక్టర్ అనుమతితో రద్దీ కూడళ్లలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పరీక్షల ద్వారా బిపి, షుగర్, గుండె సంబంధిత వ్యాధి లక్షణాలను గుర్తించి ఇప్పటికి దాదాపు 300 మందికి వైద్య సేవలు అందించినట్లు చెప్పారు. గుండె సంబంధిత వ్యాధి లక్షణాలు కలవారిని విజయవాడ వైద్యశాలకు తరలించి చికిత్స కూడా అందించినట్లు తెలిపారు. కొందరికి ఎకో టెస్టులకు సంబంధించిన ఖర్చులు కూడా సొసైటీ భరించిందన్నారు. అంతేకాకుండా గుండె సంబంధిత సమస్యలు గుర్తించిన వారికి ప్రభుత్వ వైద్యశాలలో ఉచితంగా అందించే ఖరీదైన ఇంజక్షన్ గురించి కూడా తెలియజేస్తున్నట్లు చెప్పారు. గుండె జబ్బుల పై అనుమానం ఉన్నవారు 9603989838 సంప్రదించి వైద్య సలహాలు పొందవచ్చునన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం

ప్రజాశక్తి-తాడేపల్లి : తాడేపల్లి పట్టణంలోని హెచ్‌పి గ్యాస్ కంపెనీ సమీపంలో నిర్మించిన డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ చర్మకార భవన్ (షాపింగ్ కాంప్లెక్స్)ను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ పేరిట నిర్మించిన కాంప్లెక్స్ ప్రారంభించడం సంతోషంగ ఉందన్నారు. నియోజకవర్గంలో చెప్పుల తయారీ వృత్తిలో ఉన్న వారందరికీ ఈ కాంప్లెక్స్ ఉపయోగపడుతుందని ఆకాంక్షించారు. వృత్తిదారులకు గుర్తింపు, గౌరవానికి వేదికగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలసోమిరెడ్డి, ఇ.డేవిడ్‌రాజు, ఎండి గోరెబాబు, మాచర్ల అబ్బు, చర్మకార సంఘం నాయకులు బుల్లా రాజారావు, ఎం.ప్రకాష్, దర్శి నరసింహారావు పాల్గొన్నారు.

పన్నుబకాయిపై వడ్డీ రాయితీ

ప్రజాశక్తి తెనాలి

పురపాలక సంఘ పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్ను బకాయి చెల్లించిన వారికి వడ్డీ రాయితీ వర్తిస్తుందని మున్సిపల్ కమిషనర్ బి శేషన్న తెలిపారు. ఆస్తి పన్ను, కాళీ నివేశన స్థలాలకు సంబంధించి చెల్లించాల్సిన పన్నును ఈనెల 31వ తేదీలోగా విడతల వారీగా కానీ, ఏకకాలంలో కానీ మొత్తం బకాయిలు చెల్లించిన వారికి వడ్డీ రాయితీ కల్పిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ సౌకర్యాన్ని పట్టణ ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీశైలానికి ప్రత్యేక బస్సు ఏర్పాటు

ప్రజాశక్తి-తెనలిరూరల్ : ఫిబ్రవరి 8న జరగనున్న మహాశివరాత్రి పండుగ సందర్భంగా శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సు నడపనున్నట్లు తెనాలి ఆర్టిసి డిపొ మేనేజర్ ఎ రాజశేఖర్ శనివారం ప్రకటన విడుదల చేశారు. రాత్రి 9 గంటలకు తెనాలి నుండి శ్రీశైలంకు ఆల్ట్రా డీలక్స్ బస్సు ప్రతిరోజు నడపబడుతుందన్నారు. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగ పరుచుకోవాలి సూచించారు.

జడ్‌పి హైస్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-తాడేపల్లి

పెనుమాక జిల్లా పరిషత్ హైస్కూల్ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల వ్యవస్థాపకులు, మాజీ ఎమ్మెల్యే మేకా కోటిరెడ్డి విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ, ప్రస్తుత సిఎంలు రాజశేఖరరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి



పేద విద్యార్థుల చదువులు సజావుగా సాగడానికి ఎన్నో పథ కాలను ప్రవేశపెట్టి వారి జీవితాల్లో వెలుగులు నింపారని కొని యాడారు. అనంతరం ఇటీవల జరిగిన ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహు మతులు అందజేశారు. వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసి చైర్మన్, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో ఇటీవల నూతనంగా నిర్మించిన తరగతి గదుల వద్ద వాష్‌రూమ్‌లు లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే ఆర్‌కె వాష్ రూమ్‌ల నిర్మాణానికి రూ.1.50 లక్షలు ఆర్థిక సాయం అంద జేశారు.

రికమండేషన్లు పనిచేయవు

దుగ్గిరాల ఎస్ఐ పి మహేంద్ర

ప్రజాశక్తి దుగ్గిరాల : తమ వద్ద రికమండేషన్లు పనిచేయవని శనివారం దుగ్గిరాల ఎస్సైగా పదవీ బాధ్యతలు చేపట్టిన పీ మహేంద్ర తెలిపారు. దుగ్గిరాలలో పనిచేస్తున్న ఎస్ ఐ సిహెచ్ ప్రతాప్ కుమార్ బదిలీపై తాడేపల్లి వెళ్ళగా ఆయన స్థానంలో మంగళగిరి నుండి మహేంద్ర దుగ్గిరాలకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు మండలంలో జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటామన్నారు.



రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే సుచరిత శంకుస్థాపన

ప్రజాశక్తి - తుళ్లూరు

మండలంలోని పెదపరిమి గ్రామం నుండి నెక్కల్లు, అనంతరం, వడ్డమాను వరకు బి.టి. రోడ్డు నిర్మాణం జరగనుంది. శనివారం ఎమ్మెల్యే మేకతోటి సుచరిత రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,పెదపరిమి నుండి వడ్డమాను వరకు రూ. 6 కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మాణం జరుగుతుందని చెప్పారు. రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన, టెండర్ ప్రక్రియ కూడా పూర్తయ్యిందని, ఎన్నికల నియమ నిబంధనలు అమలులోకి వచ్చినా రోడ్డు నిర్మాణానికి ఎలాంటి ఇబ్బందీ ఉండదని చెప్పారు. రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్, సంబంధిత అధికారులు సమన్వయంతో రోడ్డు నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని కోరారు. గ్రామంలోని బి ఆర్ అంబేద్కర్, వై యస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.సుచరితకు వైసిపి నాయకులు బుర్రా వెంకట శివారెడ్డి, చుండు వెంకటరెడ్డి,ఆలోకం సురేష్ పుష్పగుచ్చం అందజేసి సత్కరించారు.

పన్నులు సకాలంలో చెల్లించాలి : కమిషనర్

ప్రజాశక్తి పొన్నూరు రూరల్



పొన్నూరు పురపాలక సంఘ పరిధిలోని ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలం ఇతర పన్నులు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 రెండవ ఆర్థ సంవత్సరం వరకు పన్ను పూర్తిగా చెల్లించిన వారికి వడ్డీ మినహాయింపు ఉంటుంద న్నారు. పన్ను చెల్లింపు దారులు సకాలంలో చెల్లించి పురపా లక సంఘం అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

వైకుంఠపురం ఆలయం ఫౌండర్ ట్రస్టీ వర్ధంతి

ప్రజాశక్తి తెనాలి : వైకుంఠపురం దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త తుళ్ళూరు నరసింహారావు గౌడ్, ఆదిలక్ష్మమ్మ దంపతుల వర్ధంతిని శనివారం బస్టాండ్ సమీపంలోని బాలాజీ హోటల్ వద్ద నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే అన్నా బత్తుని శివకుమార్ నరసింహారావు గౌడ్ కాంస్య విగ్ర హానికి నివాళులర్పించారు. బిసి సామాజిక వర్గం అభివృద్ధికి, అలాగే ఆయన చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమాలను ప్రశంసించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ, మున్సిపల్ చైర్ పర్సన్ టి రాధిక, కుటుంబ సభ్యులు టి జగన్మోహన్ రావు, టి శ్రీనివాసరావు, టి మాధవరావు, వివేకానంద, ఉదయ్ భాస్కరరావు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఈక్రాప్ పంట నమోదు జాబితా పరిశీలనపై

నేటి నుండి గ్రామసభలు

ప్రజాశక్తి, తాడేపల్లి రూరల్ : ఈ క్రాప్ పంట నమోదు 2023- 24 సంవత్సరానికి గాను నమోదు చేసుకున్న రైతుల జాబితా పై ఎంటిఎంసి పరిధిలోని అన్ని గ్రామాల రైతు భరోసా కేంద్రాలలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తాడేపల్లి మండల వ్యవసాయ అధికారి ఏ శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్చి 1వ తేదీ నుండి మూడవ తేదీ వరకు పంట నమోదు జాబితాపై ఏమైనా సవరణలు ఉంటే ఆయా గ్రామాలలోని రైతు భరోసా సిబ్బందిని కలిసి వివరాలడిగి తెలుసుకోవాలని, జాబితాను ప్రదర్శన కోసం అన్ని రైతు భరోసా కేంద్రాలలో వుంచుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ రబీ సీజన్ 2023 -24 కు గాను తాడేపల్లి మండలంలో 2263 ఎకరాలలో సాగు కాబడిన అన్ని రకాల పంటలకు ఈ క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ క్రాప్ పంట నమోదు సవరణ కు ఈ మూడు రోజులు జరిగే గ్రామసభలు చివరి అవకాశం మాత్రమేనని ఆయన సూచించారు.

సైన్స్ ఎగ్జిబిషన్ పరిశీలించిన ఆర్కే

ప్రజాశక్తి మంగళగిరి



విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలుగు తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్ ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళగిరి పట్టణంలోని హీరా ఇస్లామిక్ స్కూల్లో శనివారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ఎమ్మెల్యే ప్రారంబించి, పరిశీలించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు అంశాలను వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్కూలు ప్రిన్సిపాల్ వి రామలక్ష్మి, డైరెక్టర్ ఆలీ భాష ఖాన్, పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

మురుగుడు లావణ్యకు పలువురు అభినందనలు

ప్రజాశక్తి మంగళగిరి



లావణ్య కు అభినందనలు తెలుపుతున్న జెపి

మంగళగిరి నియోజకవర్గం వైఎస్ఆర్సిపీ ఇన్చార్జిగా నియమితులైన మురుగుడు లావణ్యను శనివారం ఆమె నివాస గృహంలో విజయవాడ దుర్గ గుడి ప్రత్యేక ఆహ్వాన కమిటీ సభ్యులు జెక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి(జేపీ) కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం జేపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి బీసీ చేనేత సామాజిక వర్గానికి చెందిన మహిళలకు ఇన్చార్జిగా నియమించడం, గుంటూరు పార్లమెంటు పరిధిలో నలుగురు మహిళలకు ఇన్చార్జిలుగా ప్రకటించడం, జగన్మోహన్ రెడ్డి మహిళా పక్షపాతి అనటానికి నిదర్శనం అన్నారు. సుమారు నాలుగు దశాబ్దాల రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వస్తున్న లావణ్యకు ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, కాండ్రు కమల అనుభవంతో పాటు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమం పాలన, ఎమ్మెల్యే ఆర్కే నియోజకవర్గంలో చేసిన అభివద్ధి లావణ్య విజయానికి తోడ్పడతాయన్నారు.

మంగళగిరి మిద్దే సెంటర్లోని శ్రీ బాల గణపతి దేవాలయంలో నియోజకవర్గ వైఎస్ఆర్సిపీ ఇన్చార్జి గా నియమితులైన మురుగుడు లావణ్య, సత్యం దంపతులు శ్రీ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లావణ్య గెలుపు ఖాయం : ఆర్కే

మంగళగిరి నియోజకవర్గం వైఎస్ఆర్సిపీ ఇన్చార్జిగా నియమితులైన మురుగుడు లావణ్య గెలుపు ఖాయమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి శనివారం మంగళగిరిలో విలేకరులతో మాట్లాడుతూ అన్నారు. 2024 ఎన్నికలు మంగళగిరిలో నాన్ లోకల్, బిసి అభ్యర్థి మధ్య పోటీ జరుగుతుందని తెలిపారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, పిన్నమనేని మురళికృష్ణ తదితరులు

6న చిలువూరులో బాలోత్సవం

ప్రజాశక్తి దుగ్గిరాల

విద్యార్థులపై ఒత్తిడి తగ్గించి సృజనాత్మకత ను పెంపొందించేందుకు బాలోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ కే ఎస్ లక్ష్మణరావు తెలిపారు. స్థానిక విద్య వనరుల కార్యాలయంలో శనివారం అధికారులతో కలిసి బాలోత్సవ్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈనెల ఆరవ తేదీన చిలువూరులోని కె వి ఎస్ హై స్కూల్ లో బాలోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా అనేకచోట్ల ఈ కార్యక్రమం నిర్వహించామని 30కి పైగా అంశాల్లో విద్యార్థులకు పోటీలు ఉంటాయని తెలిపారు. ప్రైవేట్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బాలోత్సవం కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ, ఎంఇఒ కె శ్రీనివాసరావు, బాలుర హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు బాలసుందర్రావు తదితరులు పాల్గొన్నారు.



చిప్స్‌లో ముగిసిన ఫార్మా ఉమెన్ లీగ్

ప్రజాశక్తి-గుంటూరు

చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కాలేజి, మహిళా విభాగం ఆధ్వర్యంలో ఫార్మా ఉమెన్ లీగ్-2024 ఫైనల్ పోటీలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా అధ్యాపకులకు చెస్, క్యారమ్స్, టెన్నికాయిట్, షటిల్ బాడ్మింటన్ పోటీలతోపాటు, డ్యాన్స్, సింగింగ్, ఫ్యాషన్‌షో, మహానటి వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పోటీలు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐపిఎ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ టివి.నారాయణ, ఎపిటిఐ నేషనల్ ప్రెసిడెంట్ మిలింద్ జె.ఉమేకర్, ఎపిటిఐ సౌత్ రీజియన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.వెంకటరమణ, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యాధర పాల్గొన్నారు. విజేతలకు అతిథుల చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్న కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో స్టేట్ ఎపిటిఐ ఆఫీస్ మెంబర్స్ డాక్టర్ కె.వెంకటరమణ, డాక్టర్ అంకమ్మచౌదరి, డాక్టర్ లక్ష్మణరావు, డాక్టర్ డి.నరేంద్ర, ఉమెన్ పోరం కన్వీనర్ డాక్టర్ కె.పద్మలత తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న సినీహీరో రక్షిత్, తదితరులు

మలినేనిలో ముగిసిన సంస్కృతి -2024 ఉత్సవాలు

ప్రజాశక్తి-గుంటూరు

పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో రెండ్రోజులపాటు నిర్వహించిన సంస్కృతి-2024 ఉత్సవాలు శనివారం ముగిశాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా పలాస సినిమా హీరో రక్షిత్, భ్రమర టౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ గల్లా రామచందరావు హాజరయ్యారు. వివిధ కార్యక్రమాలలో గెలుపొందిన విజేతలకి రూ.5 లక్షల నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రక్షిత్ మాట్లాడుతూ విద్యార్థుల మానసిక ఉల్లాసం కోసం ఇలాంటి వినోదాత్మక కార్యక్రమాలు అవసరం అన్నారు. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులను కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు అభినందించారు. ఈ సందర్భంగా ఇసిఇ విద్యార్థులు రైతులకోసం రూపొందించిన సీడ్‌మిత్ర స్టార్టప్‌ను ప్రాంభించారు. మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ భారత ప్రభుత్వం స్టార్టప్‌కు ఆర్థికంగా ఎంతో ప్రోత్సాహం ఇస్తుందని, వాటిని ఉపయోగించుకొని, ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా ఎదగాలి అని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జెట్టి అప్పారావు , కన్వీనర్ డాక్టర్ జి.రామస్వామి, కోకన్వీనర్ డాక్టర్ డి.విజయసారధి, డాక్టర్ హరికష్ణ, డాక్టర్ కె.సునీత, డీన్‌లు డాక్టర్ పోపూరి రమేష్‌బాబు, ప్రొఫెసర్ జంపని కిషోర్‌బాబు పాల్గొన్నారు.

ఎన్నికల ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లకు శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు :సార్వత్రిక ఎన్నికల సన్నద్ధతలో భాగంగా ఎన్ఫోర్స్మెంట్ టీంలలో నియమించిన అధికారులకు శనివారం కలెక్టరేట్‌లో ఎస్ఆర్ శంకరన్ హాలులో నిర్వహించిన శిక్షణలో జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఎన్ఫోర్స్మెంట్ బందాలైన ఫ్లయింగ్ స్కాడ్ టీం (ఎఫ్ఎస్టీ), స్టాటికల్ సర్వే టీం(ఎస్ఎస్టీ) లు పకడ్బందీగా అమలు చేయాలన్నారు. పార్టీ అభ్యర్థులు అక్రమంగా నగదు, మద్యం తరలించకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ లకు ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను వివరించారు.కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ హరిహరనాధ్, జిల్లా సహకార శాఖ అధికారి వీరాచారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీ కుమారి, డిప్యూటీ కలెక్టర్ (ట్రైనీ) స్వాతి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయకర్తల మార్పు సశేషం

వీక్షణం

వైసిపి సమన్వయకర్తల మార్పు కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లాలో గత ఏడాదిన్నరగా జిల్లాలో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. సమన్వయకర్తల మార్పు ప్రక్రియకు ఏడాదిన్నర క్రితమే వైసిపి అధిష్టానం శ్రీకారం చుట్టింది. సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉన్న చోట కూడా సమన్వయకర్తల మార్పు చేపట్టారు. ఇప్పటి వరకు తాడికొండకు అత్యధికంగా ముగ్గురు సమన్వయకర్తలను మార్చారు. 2022 సెప్టెంబరులో తాడికొండ ఎమ్మెల్యే శ్రీదేవి కొనసాగుతుండగానే ఆమె స్థానంలో డొక్కా మాణిక్య వరప్రసాద్‌ను నియమించారు. ఆ తరువాత ఆమె డొక్కాను వ్యతిరేకించారు. ఆయన్ను రెండునెలలు కొనసాగించి తరువాత జెడ్‌పి చైర్‌పర్సన్ క్రిస్టీనా భర్త కత్తెర సురేష్‌ను నియమించారు. ఏడాది పాటు కొనసాగించిన తరువాత సురేష్ స్థానంలో పత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరితను నియమించారు. ఆమెతో పాటు

ఉమ్మడి జిల్లాలో ఏకంగా 9 మంది ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిలకు జంబ్లింగ్ పద్ధతిలో మార్పులు చేశారు. మంగళగిరి, పొన్నూరు, గుంటూరు తూర్పు,పశ్చిమ, చిలకలూరిపేట, వేమూరు, రేపల్లే, పత్తిపాడు నియోజవకర్గాల్లో ఇప్పటి వరకు సమన్వయకర్తలనుమార్చారు. అలాగే గుంటూరు లోక్‌సభ, నర్సరావుపేట లోక్‌సభ సమన్వయకర్తలుగా కిలారి రోశయ్య, అనిల్‌కుమార్‌ను నియమించారు. పార్టీలో సీనియార్టితో సంబంధం లేకుండా కొత్తవారికి ఇన్‌ఛార్జిల రూపంలో అభ్యర్థులను ప్రకటించారని వైసిపి నేతల్లో ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే చిలకలూరిపేట, పత్తిపాడు, పొన్నూరు, మంగళగిరి, రేపల్లే, గుంటూరు తూర్పులో రాజకీయాల్లో కొత్త వారికి అవకాశం ఇచ్చారు. సత్తెనపల్లి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి అంబటి స్థానంలో జిల్లాకు చెందిన మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి,లేదామాజీ ఎంపి మోదుగుల వేణుగోపాలరెడ్డికి అవకాశం ఇస్తారని తెలిసింది. అంబటికి చిలకలూరి పేటకు వెళ్లమని సూచించినట్టు సమాచారం. తెనాలి, బాపట్ల, పెదకూరపాడు, నర్సరావ పేట, వినుకొండ, మాచర్ల, గురజాల ఎమ్మెల్యేలను వారి నియోజకవర్గాల్లోనే యథాతథంగా కొనసాగించనున్నారు. ప్రస్తుతం ఉన్న పలువురు సమన్వయకర్తలపై కూడా సర్వే చేస్తున్నారు.మంగళగిరిలో తొలుత గంజి చిరంజీవిని నియమించారు. తాజాగా ఆయన స్థానంలో కొత్తగా మురుగుడు లావణ్యను ఎంపిక చేశారు. మోదుగుల వేణుగోపాలరెడ్డి గుంటూరు లోక్‌సభ ఇన్‌ఛార్జిగా ఉండగానే అంబటిరాయుడ్ని ప్రవేశపెట్టారు. ఆయన కొద్ది రోజులకే నిష్క్రమించారు.

తరువాత ఉమ్మారెడ్డి వెంకటరమణను ప్రకటించగా తాజాగా పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్యను నియమించారు. నర్సరావ పేట ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయులును గుంటూరు లోక్‌సభకు మార్పు చేయాలని భావించగా ఇందుకు వ్యతిరేకించిన ఆయన వైసిపి నుంచి తప్పుకొని శనివారం టిడిపిలో చేరారు.ఇంకా మార్పునకు అవకాశం ఉన్న నియోజకవర్గాల్లో చిలకలూరిపేట, సత్తెనపల్లి ఉన్నాయని వైసిపి వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అభ్యర్థుల ఎంపికలో సామాజిక అంశాలతో పాటు అన్నింటికన్నా ఆర్థికపరమైన అంశాలు అభ్యర్థుల ఎంపికలో కీలకభూమిక పోషిస్తుందని వైసిపి సీనియర్లు వాపోతున్నారు. గత ఎన్నికల్లో కన్నా ఈ సారి ఎన్నికల్లో పార్టీలో సీనియార్టి, నిబద్ధత కన్నా ఆర్థికపరమైన అంశాలకే వైసిపి, టిడిపి అగ్రతాంబూలం ఇస్తున్నాయి.

(ఎ.వి.డి.శర్మ)

విద్యార్థులు సమిష్టి తత్వం అలవర్చుకోవాలి : హైకోర్టు జస్టిస్ వెంకట శేషసాయి

ప్రజాశక్తి-గుంటూరు : కళ్లం ఇంజినీరింగ్ కాలేజి వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, టెక్ మహీంద్ర కంపెనీ రిక్రూట్‌మెంట్ మేనేజర్ వీరంరెడ్డి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ వెంకట శేషసాయి మాట్లాడుతూ సమిష్టి తత్వం అలవర్చుకోవాలని, సమిష్టిగా కలిసి ఆలోచిస్తే ఎంతటి సమస్యకైనా పరిష్కారం దొరుకుతుందన్నారు. ఆత్మవిశ్వాసం, ఇతరుల్ని గౌరవించే తత్వం పెంపొందించుకోవాలని, ఎవరితోనూ శత్రుత్వం ఉండకూడదన్నారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ప్రాముఖ్యతను వివరించారు. 2024-34 సంవత్సరాలలో జరగబోయే ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవటానికి విద్యార్థులు తగిన సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కళ్లం మోహన్‌రెడ్డి, వైస్‌ప్రెసిడెంట్ పి.వెంకటేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బిఎస్‌బి రెడ్డి, కళాశాల ఉపాధి కల్పనాధికారి డాక్టర్ పి.ఎల్.మాధవరావు, ఏఒ కళ్లం నవ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు.


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న జస్టిస్ వెంకటశేషసాయి తదితరులు


మాట్లాడుతున్న కలెక్టర్

ఎన్నికల నోడల్ అధికారులతో కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

ఎన్నికల విధుల నిర్వహణకు సంబంధించి నియమించిన నోడల్ అధికారులు వారి విధులు, నిర్వర్తించాల్సిన బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి వుంటే ఎన్నికల విధుల నిర్వహణ సులభంగా వుంటుందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శనివారం కలక్టరేట్‌లో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ, సోషల్ మీడియా కమిటీ, ఐటీ సెల్ కమిటీ, డిస్ట్రిక్ట్ ఎక్స్పెండీచర్ మానిటరింగ్ కమిటీ , సి-విజిల్, 1950 కాల్‌సెంటర్, కంప్లైంట్‌సెల్, కంట్రోల్ రూమ్‌లలో విధులు కేటాయించిన నోడల్ అధికారులతో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అందుకు సన్నద్ధతగా వివిధ టీములకు నోడల్ అధికారులుగా నియమితులైన వారు ఎన్నికల నియమావళిని, విధి విధానాలను బాగా ఆకళింపు చేసుకొని ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాల్సి వుంటుందని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో సోషల్ మీడియా , ఈ పేపర్లు , అండ్ కేబుల్ నెట్‌వర్క్‌తో సహా టీవీ , రేడియో ఛానెల్‌లు , ఆడియో - వీడియో డిస్‌ప్లేలు , సినిమా హాళ్లు , ఇంటర్నెట్ ఆధారిత మీడియా , వెబ్‌సైట్‌ల ద్వారా ప్రసారమయ్యే రాజకీయ ప్రకటనల కోసం మీడియా సర్టిఫికేషన్ , మానిటరింగ్ కమిటీ పర్యవేక్షణ చేయవలసి ఉంటుందన్నారు. సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్, తప్పుడు ప్రచారాన్ని పరిశీలించాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ పెద్ది రోజా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.స్వాతి , ఆర్డిఒ శ్రీఖర్ తదితరులు పాల్గొన్నారు.


విరాళం అందచేస్తున్న రత్నగిరిబాబు, శ్రీరాంభాస్కర్

శంకర ఆసుపత్రికి జనచైతన్య రూ.10 లక్షలు విరాళం

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజలకు అధునాతక కంటి వైద్యం ఉచితంగా అందిస్తున్న శంకర కంటి ఆసుపత్రికి 20వ వార్షికోత్సవం సందర్భంగా మరొక నూతన కంటి ఆసుపత్రి భవననానికి జనచైతన్య హౌసింగ్ ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్ మాదల రత్నగిరిబాబు, మాదల శ్రీరాంభాస్కర్ చేతులమీదుగా జనచైతన్య ఫ్యామిలీ తరపున రూ.10 లక్షల విరాళంగా అందజేశారు. ఈమొత్తాన్ని శనివారం డాక్టర్ సుధాకర్‌కు అందజేశారు. రత్నగిరిబాబు మాట్లాడుతూ గతంలో శంకర ఆసుపత్రికి కోట్లాది విలువ చేసే 5 ఎకరాలు విరాళంగా ఇవ్వటం జరిగిందని, ఇప్పుడు విరాళం అందించటం సంతోషంగా ఉందన్నారు.